ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శుక్రవారం | 31-07- 2026 సంపుటి: 17, సంచిక: 118, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

## పరీక్షల బిల్లుకు రాజ్యసభ

# ఆమోదం

### మూజువాణి ఓటింగ్ ద్వారా క్లియర్

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదమే తరువాయి

### తర్వాత చట్టంగా పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు 2026

న్యూఢిల్లీ, జూలై 30: ప్రశ్నపత్రాల లీకేజీని నిరోధిం చేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు 2026'ను గురువారం రాజ్యసభ ఆమోదిం చింది. సభ ప్రారంభం కాగానే కేంద్ర శాస్త్ర, సాంకేతికత శాఖ మంత్రి జితేంద్రసింగ్ బిల్లును పెద్దల సభలో ప్రవేశపెట్టారు. సభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ బిల్లుపై మూడు గంటల పాటు చర్చించేందుకు అవకాశమి చ్చారు. అనంతరం కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రసంగిస్తూ.. ప్రశ్నాపత్రాల లీకులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నదని, లీకేజీకి పాల్పడేవారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించమని హెచ్చరించారు. కేసుల తక్షణ పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని తెలిపా రు. పిల్లల భవిష్యత్తును కాలరాయాలని చూసే వారిపై కఠిన చర్యలు తీసుకుం టామని ఉద్ఘాటించారు. అనంతరం చైర్మన్ బిల్లుపై మూజువాణి (వాయిస్) ఓటింగ్ నిర్వహించగా, బిల్లు నెగ్గింది. ఈ బిల్లు బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందిన విషయం తెలిసిందే. తాజాగా రాజ్యసభ



కూడా బిల్లుకు ఆమోదం తెలపడంతో ఇక రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేయడమే తరువాయి. బిల్లుకు ఆమోదం లభించిన వెంటనే ఇక అధికారిక చట్టంగా అమలులోకి రానుంది.

**మోదీ కుర్చీని కాపాడారు: ఖర్గే**

రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే పేపర్ లీక్ అంశంపై సభలో అనేక ప్రశ్నలు లేవనెత్తారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయడం, పేపర్ లీక్ చేసిన దోషులకు

తరువాయి 2వ పేజీలో...

## నాణ్యమైన విద్యను అందించే

# దీక్షబూనండి

- మండలం యూనిట్‌గా ప్రణాళికలు పంపండి..
- ప్రతి పిల్లవాడు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా పని చేయాలి
- మీ పర్యటన అనుభవాలు విద్యార్థులకు మేలు చేయాలి
- విదేశీ విద్యకు ఏటా 10-15 మంది ఉపాధ్యాయుల ఎంపిక
- సమాజ మార్పునకే విద్యా శాఖ బాధ్యతలు
- ఉపాధ్యాయులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జూలై 30 (ప్రజాకలం) :

నాణ్యమైన విద్య రాష్ట్రానికి పునాది అయితే, నైపుణ్యాలు అంతస్తుల్లాంటివని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. రానున్న ఐదేళ్ల ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందిస్తామనే దీక్షను ఉపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు. టీచర్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్'' కార్యక్రమంలో భాగంగా ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో ఎంసీహెచ్‌ఆర్డీలో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్కో విద్యార్థిపై సగటున రూ.1.08 లక్షలు వ్యయం చేస్తున్నామని, దానిని వారి అభివృద్ధికి పెట్టే పెట్టుబడిలా చూడాలన్నారు. అంత మొత్తం ఖర్చు చేస్తున్నా విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు ఎందుకు వెళుతున్నారో ఆలోచించాలన్నారు. తెలంగాణలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యా వ్యవస్థ ఉండాలనే లక్ష్యంతోనే ఉపాధ్యాయులను విదేశీ పర్యటనలకు పంపుతున్నామని తెలిపారు. ఆయా దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులు అక్కడి అనుభవాలను ఇక్కడ ఆచరణలో తీసుకురావాలని సూచించారు. వివిధ దేశాల పర్యటనతో ప్రపంచం ఎటు వెళుతుందో తెలుస్తుందని.. పర్యటనతో తెలుసుకున్న అంశాలను ఇక్కడ విద్యార్థులకు బోధించి వారిని ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆస్తులు లేకపోవడం వెనుకబాటుతనం కాదని, విద్య లేకపోవడమే వెనుకబాటుతనమని తాము నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, కుల సర్వే తేల్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎకరాల కొద్ది భూమి, ఇతర ఆస్తులు ఉన్నా సమాజం ఎటు వెళుతుందో తెలియక వెనుకబడి పోతున్నారని, ఏ ఆస్తులు లేకపోయినా చదువుకొని ఉద్యోగాలు సాధించిన వారు ప్రపంచంతో పోటీ పడుతున్నారని తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతోనే బ్రేక్‌ఫాస్ట్ స్కీంకు రూపకల్పన చేశామన్నారు. తాము అధికారంలోకి వచ్చాక హాస్టల్ విద్యార్థులకు డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామన్నారు. 55 రోజుల్లోనే 11 వేల ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టామని, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు ఇచ్చామని సీఎం గుర్తు చేశారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల మాదిరే ప్రతి ఏటా 10 నుంచి 15 మంది ఉపాధ్యాయులను విదేశీ విద్యకు పంపిస్తామని సీఎం తెలిపారు. అక్కడ నేర్చుకున్న జ్ఞానాన్ని ఇక్కడ విద్యార్థులకు పంచాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తాను పాటుపడతానని, ఉపాధ్యాయ సంఘాలు విద్యార్థుల సమస్యలపై తనతో కొట్లాడాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

తరువాయి 2వ పేజీలో...



## దేశంలో విమాన ఛార్జీలపై

# నియంత్రణేది?

### ధరలు విపరీతంగా పెరగడానికి గల కారణాలేంటి..?

- జలజీవన్ మిషన్‌లో తెలంగాణలోని గ్రామీణ గృహాలకు నల్లా కనెక్షన్ల పరిస్థితి ఎలా ఉంది?
- లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి ప్రశ్నలు
- సమాధానాలిచ్చిన కేంద్ర మంత్రులు మోహోల్, వి. సోమన్న

ఖమ్మం జులై 30(ప్రజా కలం న్యూస్ )

దేశంలో విమాన సర్వీసుల ధరల పెరుగుదల, ప్రయాణికుల నుంచి వస్తున్న ఫిర్యాదులు అలాగే గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా తీరుతెన్నులపై... పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి గురువారం ప్రశ్నించారు. విమాన ఛార్జీలు విపరీతంగా పెరగడానికి గల కారణాలేంటి? అని ఆరా తీశారు. దీనికి కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా.. మార్కెట్ డిమాండ్, సీజనాలిటీ మరియు అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా ఎయిర్‌లైన్స్ స్వయంగా ఈ డైనమిక్ ధరలను నిర్ణయిస్తాయని మంత్రి స్పష్టం చేశారు. తక్కువ ఛార్జీల టికెట్లు అమ్ముడైపోయిన కొద్దీ ధరలు పెరుగుతాయని,ప్రయాణికులకు

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్






### నీట మునిగిన బడి.. !!

### వర్షం కురిసిందంటే చాలు... విద్యార్థుల అవస్థలు..

# వానొస్తే..సెలవే..!



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 30 (ప్రజా కలం) పాఠశాల ప్రాంగణం మొత్తం నీటితో నిండిపోతూ చెరువును తలపిస్తోంది. దీంతో విద్యార్థులు తరగతి గదులకు చేరుకోవడమే కష్టసాధ్యంగా మారుతోంది. ఎక్కడో మారుమూల గ్రామంలో అనుకుంటే పొరపాటు.. మెట్ పల్లి పట్టణంలోని 11వ వార్డులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దుస్థితి ఇది.. ఏదో పొరపాటు వల్ల పరిసర ప్రాంతాల వర్షపు నీరంతా పాఠశాల ఆవరణలోకి చేరుతుండటంతో బడి మొత్తం జలమయమవుతోంది. పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు బురద, మురుగు నీటిలో నడుచుకుంటూ తరగతి గదులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దోమల బెడద, దుర్వాసనతో పాటు అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పలుమార్లు పరిశీలించినప్పటికీ శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతం కావడంతో విద్యార్థుల చదువుపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని వారు పేర్కొంటున్నారు. తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా, పాఠశాల ఆవరణలోకి వర్షపు నీరు చేరకుండా సరైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యకు ప్రాధాన్యత ఇస్తూ సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## నీట మునిగిన మెట్‌పల్లి డిగ్రీ కళాశాల

### భారీ వర్షాలతో కళాశాల ప్రాంగణంలోకి చేరిన వరద నీరు



3

## ధరణి అక్రమాలపై

# ఉక్కుపాదం

### బాధ్యులపై కఠిన చర్యలు!

ధరణి మోసాల వెనుక ఉన్న నిజాలు త్వరలోనే బయటపెడతాం : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పేదల భూములు కాజేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు అని ప్రకటన.



ఖమ్మం జులై 30(ప్రజా కలం న్యూస్)

కల్లూరు ధరణి పోర్టల్ ద్వారా జరిగిన భూ అక్రమాలను సమూలంగా వెలికితీసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. గురువారం కల్లూరులోని డీఎన్‌పీ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన సత్తుపల్లి క్లస్టర్ ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని, ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించారు.

తరువాయి 2వ పేజీలో...

## భారీ వర్షాల పట్ల

# అప్రమత్తంగా ఉండండి

### జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులకు సి.ఎస్. ఆదేశం



హైదరాబాద్, జూలై 30 (ప్రజాకలం) :

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఏవిధమైన ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. రాష్ట్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, మరో రెండు రోజుల పాటు కురిసే అవకాశం ఉన్నందున చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమీషనర్లు, ఎస్. పి లతో సి.ఎస్ సంజయ్ జాజు గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ సి.వీ ఆనంద్, అడిషనల్ డీజీ భగవత్, డిజాస్టర్ మేనేజ్ మెంట్ కార్యదర్శి హరిచందన, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, గురువారం రాత్రి కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలుపుతున్నందున జిల్లాల్లో పోలీసు వివిధ శాఖలతో సమన్వయంతో తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ప్రధానంగా, ఆయా జిల్లాలో వాటర్ ఫాల్స్, ప్రమాదకర ప్రదేశాలు ఉన్న పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులు

తరువాయి 2వ పేజీలో...

## సూపర్ ఎల్‌నినోపై

# అప్రమత్తం చేయాలి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సిరిసిల్ల, జూలై 30 (ప్రజా కలం న్యూస్)

సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రైతులు, ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం సూపర్ ఎల్‌నినోపై రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించగా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో రూపొందించిన పీపీటిని ప్రదర్శించారు.

తరువాయి 2వ పేజీలో...

## నాణ్యమైన విద్యను అందించే

# దీక్షబూనండి

మొదటి పేజీ తరువాయి...

ఉపాధ్యాయులు ఏ మండలానికి ఆ మండలం యూనిట్‌గా తీసుకొని, వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. ఆ మండలంలోని పాఠశాలల్లో ఏ వసతులు కావాలి, ఎంత మంది ఉపాధ్యాయులు కావాలి, మెరుగైన విద్యా బోధనకు తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి? ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరేందుకు ఏం అవసరమనే అంశాలు ఆ ప్రణాళికలో ఉండాలని సూచించారు. డిసెంబరు నెలాఖరుకు ఆ ప్రణాళిక తమకు అందజేస్తే దానికి అనుగుణంగా తాము కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆయా మండలాల నుంచి వచ్చే సూచనలు, సలహాలను ఆ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని సీఎం సూచించారు.

వచ్చే అయిదేళ్ల వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు దీక్షబూనాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ప్రపంచ దేశాలు మన వైపు చూసేలా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దాలని, సమాజం కోసం, తరతరాల భవిష్యత్ ను మార్చేందుకు అయిదేళ్ల పాటు పాటుపడేందుకు ప్రతిజ్ఞ తీసుకోవాలని ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. దేశానికే ఆదర్శంగా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేయాలని కోరారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయులకు మొదటి తేదీనే వేతనాలు అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని, విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందజేస్తున్నామని తెలిపారు. విద్యపై ఎంత మొత్తమైనా ఖర్చు చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మానవ సంబంధాలను మెరుగుపర్చే ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పిల్లలు మనలోని మానసిక ఒత్తిడిని దూరం చేస్తారని అన్నారు. కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు ఉన్న సమాజం, దేశమే అభివృద్ధి చెందుతుందని, మానవ సంబంధాలు లేని దేశాలు అభివృద్ధి పథంలో పయనించవని సీఎం పేర్కొన్నారు. విద్యార్థులు రోజులో అధిక సమయం పాఠశాలల్లోనే ఉంటారని, వారికి మానవ సంబంధాల ప్రాధాన్యతను తెలియజేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని సీఎం అన్నారు.

విద్య నైపుణ్యం కాదని, విద్యతోపాటు నైపుణ్యం అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇంగ్లీష్ ఒక భాష మాత్రమేనని, భాష సమాచార మార్పిడికి ఉపయోగపడుతుందని, నైపుణ్యం జీవనోపాధి కల్పిస్తుందన్నారు. చైనా, జపాన్, కొరియా, జర్మనీ దేశాల్లో ఇంగ్లీష్ మాట్లాడే వారు 10 శాతం మించి ఉండరని, కానీ వారికున్న నైపుణ్యంతో ప్రపంచాన్ని శాసిస్తున్నారని తెలిపారు. జపాన్, జర్మనీ, కొరియా భాషలు కొంత నేర్చుకొని నైపుణ్యాలు నేర్చుకుంటే అక్కడ మంచి ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. 12వ తరగతి తర్వాత విద్యార్థికి ప్రపంచంపై సంపూర్ణ అవగాహన ఉండాలని, ఆ అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నిరక్షరాస్యత, కరవుకాటకాలతో దేశం సతమతమవుతున్నప్పుడు ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ విద్యా, నీటిపారుదల రంగాలను తన ప్రాధాన్యాంశాలుగా ఎంచుకొని ఆ సమస్యలను అధిగమించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఐఐటీలు, ఐఐఎంలు, యూనివర్సిటీలు, సాగు నీటి ప్రాజెక్టులు నెహ్రూ దార్శనికతకు నిదర్శనమన్నారు. నాడు వేసిన పునాదులతో నేడు ప్రతి తండా, గూడెంలోనూ పాఠశాలలు ఏర్పాటయ్యాయని, ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులోకి వచ్చిందని తెలిపారు.

సాంకేతిక విప్లవంతో వైట్ కాలర్ జాబ్‌లను మనం అందిపుచ్చుకున్నామని, కానీ ఇప్పుడు ఆ జాబ్‌లకు కాలం చెల్లిందన్నారు. జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా లాంటి దేశాల్లో నైపుణ్యాలకు డిమాండ్ ఉన్నందున, అక్కడి అవసరాలకు తగినట్లు నైపుణ్యాలు పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అందులో భాగంగానే సంప్రదాయ కోర్సులతో ప్రభావం కోల్పోయిన ఐటీఐలను టాటా సంస్థ సహకారంతో ఏటీసీలుగా ఆధునీకరించామని, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఉట్నూరు ఏటీసీలో శిక్షణ పొందిన వారంతా టాటా సంస్థలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని సీఎం తెలిపారు. కరవు, కాటాకాలు, నిరక్షరాస్యతలో కూరుకుపోయిన దేశాన్ని సాగు నీటి ప్రాజెక్టులు, విద్యాలయాల ఏర్పాటుతో సుభిక్షమైన దేశంగా తీర్చిదిద్దిన నెహ్రూపైనా విమర్శలు గుప్పిస్తున్నారని విమర్శించారు. పాకిస్థాన్‌లను ఓడించి, ఆ దేశాన్ని రెండు ముక్కలు చేసి, గరిబీ హటావో నినాదంతో పని చేసిన ప్రధానమంత్రి ఇందిరా గాంధీపైనా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గరి నుంచి 2014 వరకు ప్రధానమంత్రులుగా చేసిన వారు రూ. 51 లక్షల కోట్ల అప్పులు చేస్తే, 2014 నుంచి 2026 వరకు 12 ఏళ్లలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రూ. 151 లక్షల కోట్లు అప్పులు చేశారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు.

గోరంత పనులను కొండంత చెప్పుకుంటున్నారని, ఎన్నో యుద్ధాలు, కలి, నిరక్షరాస్యతలను అధిగమించిన విజయాలను ఎలా ప్రచారం చేయాలని ప్రశ్నించారు. తెలంగాణ బిడ్డ పి.వి.నరసింహారావు కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు సర్వేలు గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారని, తర్వాత కాలంలో అదే నవోదయ విద్యాలయాలకు, గురుకుల పాఠశాలలకు నమూనాగా నిలిచిందన్నారు. ఆ పాఠశాలలో చదువుకున్న వారు ఎందరో ఉన్నత స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. సాగు నీటి ప్రాజెక్టులను నెహ్రూ ఆధునిక దేవాలయాలుగా వర్ణించారని, నాడు నిర్మించిన నాగార్జున సాగర్, ఎస్సారెస్పీ వంటి ప్రాజెక్టుల ఫలితంగానే తెలంగాణలో ఈనాడు 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి సాధ్యమైందన్నారు. 80 వేల పుస్తకాలు చదివి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూళేశ్వరం అయిందని విమర్శించారు. ప్రతి పేద విద్యార్థికి విద్యను అందించడంతో సరిపెట్టుకోకుండా వారిని ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దాలనేది తన ఆశయమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కొండారెడ్డిపల్లి వంటి మారుమూల పల్లె ప్రభుత్వ పాఠశాలలో చదివిన తాను తెలంగాణలోని 12 వేల పల్లెల్లోని పాఠశాల పిల్లలు ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నానని సీఎం అన్నారు.

కొందరు విద్యా శాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని విమర్శిస్తున్నారని, నర్సరీ నుంచి 12 వతరగతి వరకు బ్రేక్ఫాస్ట్ ఇస్తున్నందుకా? టీచర్ల నియామకం, ప్రమోషన్లు సక్రమంగా చేపట్టినందుకా? ఐటీఐలను ఏటీసీలుగా మార్చినందుకా? స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినందుకా? ప్రపంచంలోనే సక్సెస్ అయిన కార్పొరేట్ సంస్థల యజమానులను స్కిల్స్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ మెంబర్స్ గా నియమించినందుకా? ఎందుకు తాను రాజీనామా చేయాలో వాళ్లు తెలపాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం, రాజకీయం కోసం తాను పని చేయడం లేదని సీఎం అన్నారు. ప్రపంచంతో తెలంగాణ విద్యార్థులు పోటీ పడాలనేదే తన లక్ష్యమన్నారు. సమాజ మార్పునకే తాను విద్యా శాఖ బాధ్యతలు తీసుకున్నానని తెలిపారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని పునరుద్ఘాటించారు. నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

సమావేశానికి ముందు ఫిన్లాండ్, జర్మనీ దేశాలలో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయుల బృందం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను ముఖ్యమంత్రి వీక్షించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఎంసీఆర్‌హెచ్ఆర్డీ డైరెక్టర్ శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పరీక్షల బిల్లుకు రాజ్యసభ ఆమోదం

మొదటి పేజీ తరువాయి...

భారీ మొత్తంలో జరిమానా విధించడంతోనే లీకేజీలు ఆగవని అభిప్రాయపడ్డారు. లీక్‌ల కారణంగా విద్యావ్యవస్థపై విద్యార్థుల కు నమ్మకం పోయిందని వాపోయారు. కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి ప్రధాని మోదీ కుర్చీ కాపాడారని కుండబద్దలు కొట్టారు. నీట్ లీక్ వల్ల దేశవ్యాప్తంగా ఎంతోమంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీని ప్రశ్నిస్తూ పోరాడిన విద్యార్థులపై ఎందుకు లాఠీచార్జి చేశారో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లాఠీచార్జికి అమిత్‌షా బాధ్యత వహించాలని పట్టుబట్టారు. అలాగే, మనుస్మృతిపైనా ఖర్గే వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలు సభలో గందరగోళానికి దారితీశాయి. అధికార పార్టీ సభ్యులు జేడీ నడ్డా, సుధాంశు త్రివేది అభ్యంతరం మేరకు చైర్మన్ ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించారు.

**లోక్‌సభలో ‘వందేమాతరం’ బిల్లుకు ఆమోదం**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వందేమాతర గీతం బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ‘ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ –1971’కు కేంద్రం సవరణలు చేయగా, ఈ బిల్లు ఇప్పటికే బుధవారం రాజ్యసభలో ఆమోదం పొందింది. బిల్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం పొందిన తర్వాత చట్టంగా మారనుంది. దీంతో జాతీయ గేయం ‘జనగణమన’కు చట్టపరమైన రక్షణ వచ్చినట్టే, ఇక వందేమాతర గీతానికీ రానున్నది.

కొత్త చట్టం ప్రకారం ఇకపై ఎవరైనా గీతాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించినా, లేదా గీతాన్ని ఆలపిస్తుండగా ఆటంకం కలిగించినా శిక్షార్హం. నేరం. దోషులకు న్యాయస్థానం గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించవచ్చు. ఈ బిల్లు లోక్‌సభలో మూజువాణి (వాయిస్) ఓటింగ్ ద్వారా ఆమోదం పొందింది. స్పీకర్ ఉదయం బిల్లుపై మూజువాణి ఓటింగ్ నిర్వహించారు. అంత గందరగోళంలోనూ బిల్లు ఆమోదం పొందడం విశేషం. ప్రశ్నోత్తరాల సమయాన్ని కొనసాగించాలని స్పీకర్ విజ్ఞప్తి చేసినప్పటికీ, గందరగోళం సర్దుమణగకపోవడంతో సభను తొలుత మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా నిరసనలు శ్రుతిమించడంతో లోక్‌సభ రోజంతా వాయిదా పడింది. స్పీకర్ సభను చివరకు శుక్రవారానికి వాయిదా వేశారు. పెద్దలసభలోనూ వందేమాతరం బిల్లుపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ప్రసంగిస్తూ దేశ గౌరవాన్ని, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడమే ఈ బిల్లు ఉద్దేశమని ఉద్ఘాటించారు. వందేమాతర గేయం భారత స్వాతంత్ర్య పోరాటానికి, జాతీయ చైతన్యానికి ప్రతీక అని అభివర్ణించారు.

**హక్కులను హరించడమే: అసదుద్దీన్ ఓవైసీ**

వందేమాతరం బిల్లు ఆమోదంపై ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ.. వందేమాతర గీతంలో దైవారాధనకు సంబంధించిన అంశాలు ఉన్నాయని, అలాంటి గీతంపై ఏకపక్షంగా బిల్లు తీసుకురావడం లౌకిక స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 25, 26, 29 ద్వారా దేశ పౌరులకు సంక్రమించిన మత స్వాతంత్ర్య ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని ఆరోపించారు.

# దేశంలో విమాన ఛార్జీలపై నియంత్రణేది?

మొదటి పేజీ తరువాయి...

అందుబాటు ధరలు కల్పించేలా డైనమిక్ ప్రైసింగ్ ఫ్రేమ్‌వర్క్ పని చేస్తుందని తెలిపారు. చార్జీల పర్యవేక్షణకు డీజీసీఏ ఎయిర్‌లైన్స్ సంస్థలు తాము ప్రకటించిన పరిమితిని మించి అధిక ఛార్జీలు వసూలు చేయకుండా పర్యవేక్షించేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ( డి జి సీఏ ) ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ‘టారిఫ్ మానిటరింగ్ యూనిట్’ (టీఎంయూ ) ఏర్పాటు చేసినట్లు కేంద్రం వెల్లడించింది. ఎంపిక చేసిన 78 రూట్లలో విమాన ఛార్జీలను పరిశీలిస్తుందని పేర్కొంది. అధిక చార్జీలపై ఫిర్యాదుకు.. ఎయిర్ ఫేర్ గ్రీవెన్స్ అధిక ఛార్జీలపై ప్రయాణికుల ఫిర్యాదుల పరిష్కారానికి జూలై 2025 నుంచి ‘ఎయిర్‌సేవా’ ప్లాట్‌ఫామ్‌లో ప్రత్యేకంగా ‘ఎయిర్ ఫేర్’ గ్రీవెన్స్ ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. దీని ద్వారా జూలై–డిసెంబర్ 2025లో 394 ఫిర్యాదులు, జనవరి నుంచి జూలై 2026 వరకు 315 ఫిర్యాదులు అందగా వాటిని పరిశీలించినట్లు ప్రభుత్వం పేర్కొంది. ‘జల్ జీవన్ మిషన్ (జేజేఎమ్ )’ అమలు తీరుపై మరో మంత్రి సమాధానమిస్తూ.. జలశక్తి శాఖ సహాయ మంత్రి వి. సోమన్న వివరాలు అందజేశారు. ఆరంభంలో దేశవ్యాప్తంగా కేవలం 3.24 కోట్లు (16.72%) ఉన్న గ్రామీణ కుళాయి కనెక్షన్లు, జూలై 18, 2026 నాటికి 15.89 కోట్లకు (82.09%) చేరుకున్నాయని మంత్రి తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ కింద మొత్తం 53,98,219 గ్రామీణ కుటుంబాలకు వంద శాతం నల్లా కనెక్షన్లు అందించినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలో ఒక్క కుటుంబం కూడా కుళాయి కనెక్షన్‌కు దూరంగా లేదని కేంద్రం స్పష్టం చేయగా, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 95,53,387 కుటుంబాలకు గాను ఇప్పటివరకు 72,10,929 కనెక్షన్లు ఇచ్చామని, ఇంకా 23,42,458 కుటుంబాలకు కనెక్షన్లు అందాల్సి ఉందని వెల్లడించారు.

# సూపర్ ఎల్‌నినోపై అప్రమత్తం చేయాలి

మొదటి పేజీ తరువాయి...

జిల్లా ఎల్‌నినో ప్రణాళిక, తెలంగాణ జలసిరి పేరిట రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా పరిధిలోని ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయి, వాటిలో నీటిమట్టం, జిల్లాలో ఎన్ని ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు, మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై మంత్రి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సూపర్ ఎల్‌నినో ప్రభావం దక్షిణ భారత దేశంపై ఎక్కువగా ఉంటుందని తెలిపారు. వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని వివరించారు. ఇప్పుడు రిజర్వాయర్లలో ఉన్న నీరు తాగునీటికి మాత్రమే వచ్చే ఏడాది జూలై వరకు వినియోగించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. రెండు రోజుల్లో కురిసిన వర్షం పంటలకు కొంత మేలు చేస్తుందని, కానీ పంట పూర్తిగా చేతికి వచ్చే వరకు ఉపయోగపడదని తెలిపారు. గత రెండు నెలలు సరిగా వర్షాలు సరిగా కురవక పంటల సాగు గణనీయంగా తగ్గిందని, వచ్చే నెలలో ఏ పంటలు సాగు చేస్తే మేలో రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆరుతడి, స్వల్పకాలిక పంటలు, పప్పు ధాన్యాలు, ఆయిల్ పామ్ సాగు చేసేలా వివరించాలని పేర్కొన్నారు. వాటికి కావలసిన అన్ని విత్తనాలు అందుబాటులో పెట్టాలని సూచించారు. మంచి ప్రణాళిక ప్రకారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ముందుకు వెళ్లాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతులకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

**ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చూడాలి**

గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలాలు రెండు మీటర్లకుపైగా లోతులోకి వెళ్ళాయని మంత్రి వెల్లడించారు. జిల్లాలోని అన్ని రిజర్వాయర్లలోని నీరు పంటలకు విడుదల చేసే అవకాశం లేదని, భూగర్భ జలాల సమాచారం అధికారులు ప్రజలు, రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చూడాలని ఆదేశించారు. తెలంగాణ జలసిరి కింద బోర్ వెల్స్ రీచార్జ్ పనులు, పామ్ పాండ్స్ నిర్మాణ పనులు ముమ్మరంగా చేయించాలని స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, పాఠశాలల ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. జిల్లాలోని మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలని, రిజర్వాయర్ల నీటిని పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పంపింగ్ కోసం కావాల్సిన మోటర్లు అదనంగా సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎరువుల కొరత, ఇతర ఇబ్బందులపై వచ్చే అసత్య ప్రచారాలు చేయకుండా చూడాలని సూచించారు. పోలీస్ అధికారులు శాంతి భద్రతల పరిరక్షిస్తూనే ప్రతీ అంశంపై దృష్టి సారించాలని ఆదేశించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.

**రైతులకు అవగాహన కార్యక్రమాలు**

ఎల్‌నినో, పంటల మార్పిడిపై జిల్లాలో రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, ఇంచార్జి మంత్రి సూచనలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. జిల్లాలో తాగునీటి సరఫరా కోసం శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయం కీలకమని తెలిపారు. గత ఏడాది జిల్లాలో లక్ష 85 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారని, ఈ ఏడాది ఇప్పటి వరకు 78 వేలు సాగు అయిందని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతు భరోసా అందుతున్న రైతులందరికీ ఈ విషయమై ఫోన్లకు సమాచారం పంపుతున్నామని వెల్లడించారు. ఆగస్టులో సాగు చేసే పంటలపై ఇప్పటికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రైతులకు మరిన్ని సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాకు ఆయిల్‌పామ్ 1500 ఎకరాలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 400 ఎకరాలు పూర్తి చేయించామని, మిగతా పురోగతిలో ఉందని వెల్లడించారు. తెలంగాణ జలసిరి కింద జిల్లాలో నీటి సంరక్షణ పనులు పకడ్బందీగా చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, వేములవాడ ఆర్డీఓ కేవీఎస్ బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

మొదటి పేజీ తరువాయి...

వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల కలెక్టర్లు పరిస్థితులను ఎప్పటి కప్పుడు సమీక్షిస్తుండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఇప్పటికే, ఎన్.డీ.ఆర్.ఎఫ్, ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచామని, అవసరమైనప్పుడు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

కాగా, ఎల్.నినో ప్రభావం వల్ల సెప్టెంబర్ లోనూ వర్షపాతం తక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ పేర్కొన్నందున వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటలను వేసేలా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రధానంగా, కూరగాయలు పండిస్తే మార్కెట్ లో మంచి ధర ఉండడమే కాకుండా హరే కృష్ణ ఫౌండేషన్ ద్వారా కూడా కొనుగోలు చేయించడం జరుగుతుందని సి.ఎస్ అన్నారు. వచ్చే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రంలోని పలు జిల్లాలో 249 ప్రమాదకర జలాశయాలున్న పిక్-నిక్ స్పాట్స్ లను గుర్తించామని, మరో 167 పర్యాటక ప్రాంతాలను గుర్తించి భారీ వర్షాలు, వరదలున్న సమయంలో ఈ పర్యాటక ప్రాంతాలకు వెళ్లకుండా పోలీస్ శాఖ తగు చర్యలను చేపట్టిందని డీజీపీ సి.వీ ఆనంద్ వెల్లడించారు. 12 కంపెనీల SDRF బృందాలు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు.

# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

మొదటి పేజీ తరువాయి...

ధరణి అక్రమాలు బాహ్య ప్రపంచానికి వెల్లడిస్తాం

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ధరణి వ్యవస్థను ఆసరాగా చేసుకుని అనేక అక్రమాలు, భూముల మళ్లింపులు, ప్రభుత్వ భూముల అక్రమ బదిలీలు జరిగాయని తెలిపారు. పేదల భూములను ఎలా కాజేశారో సమగ్ర విచారణ ద్వారా ఆధారాలతో సహా త్వరలోనే ప్రజల ముందుకు తెస్తామన్నారు. ఎంతటి వారైనా సరే తప్పు చేసిన వారిని వదిలిపెట్టేది లేదని, కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు.

50 ఏళ్ల రెవెన్యూ సమస్యలకు పరిష్కారం

సత్తుపల్లి, కల్లూరు ప్రాంతాల్లో గత 50 ఏళ్లుగా నలుగుతున్న భూ సమస్యలను సమగ్ర భూ రీ–సర్వే ద్వారా పరిష్కరిస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. మరో ఏడాదిన్నర వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా సర్వే పూర్తి చేసి రైతులకు, భూయజమానులకు శాశ్వత పరిష్కారం అందిస్తామన్నారు. ఈ ప్రజాదర్బార్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కూరగాయల సాగును ప్రోత్సహించండి

## సెంట్రలైజ్డ్ కిచెన్స్ పరిసర ప్రాంతాల్లో దృష్టి పెట్టండి
## ఆర్గానిక్ సాగు దిశగా రైతులకు అవగాహన కల్పించండి
## నిపుణుల కమిటీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
## ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నివేదికను అందజేసిన కమిటీ




హైదరాబాద్, జూలై 30 : రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఆర్గానిక్ వద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ నుంచి ఎక్స్టెన్షన్ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది.

నివేదికలో కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. తెలంగాణలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని పేర్కొంది. గ్రామాలవారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. 75శాతం సబ్సిడీతో ఈ పంటలకు సంబంధించిన విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది.

గత ఏడాది ఈ సీజన్ లో 79.49 లక్షల ఎకరాలు సాగవగా, ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాలు మాత్రమే సాగయ్యాయని పేర్కొంది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.62 లక్షల ఎకరాలు, వరి 14.92 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో తెలిపింది. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్ప్రింక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించింది. పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందించి... పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగునీటి కోసం నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలంది. హైదరాబాద్ పరిసర గ్రామాల్లో కూరగాయల సాగును ప్రోత్సహిస్తూ రైతు బజార్లకు రవాణా సౌకర్యం కల్పించాలని నివేదికలో పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో డైరీ యూనిట్లను స్థాపించేందుకు ఆర్థిక సహాయం అందించాలని, అత్యవసర చర్యల అమలును పర్యవేక్షించేందుకు గ్రామస్థాయి బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# నీట మునిగిన మెట్‌పల్లి డిగ్రీ కళాశాల

## భారీ వర్షాలతో కళాశాల ప్రాంగణంలోకి చేరిన వరద నీరు

### ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు.. తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి

### డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు విన్నపాలు



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 30 (ప్రజా కలం) గత కొన్ని రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాల ప్రభావంతో మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్తిగా నీట మునిగింది. కళాశాల ఆవరణలోని మైదానంలో భారీగా వరద నీరు నిలిచిపోవడంతో మొత్తం ప్రాంగణం చెరువును తలపించేలా మారింది. ప్రధాన ప్రవేశ మార్గంతో పాటు కళాశాల పరిసర ప్రాంతాల్లో కూడా నీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు, అధ్యాపకులు కళాశాలకు చేరుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాల మైదానంలో నిలిచిపోయిన నీటి కారణంగా విద్యార్థులు బురద, నీటిలోనే నడుచుకుంటూ తరగతి గదులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలు కొనసాగితే విద్యా కార్యక్రమాలు మరింత దెబ్బతినే అవకాశం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల ప్రాంగణంలో నీరు ఎక్కువసేపు నిల్వ ఉండటం వల్ల దోమలు, అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం కూడా ఉందని పేర్కొంటున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల వర్షపు నీరు బయటకు వెళ్లక కళాశాల ఆవరణలోనే నిలిచిపోతోందని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యకు తాత్కాలిక చర్యలకే పరిమితం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు. కళాశాల ప్రాంగణంలో నిలిచిన వరద నీటిని వెంటనే తొలగించి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రాధాన్యత క్రమంలో వార్డుల్లో అభివృద్ధి

## – మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 30 (ప్రజా కలం)

ప్రాధాన్యత క్రమంలో మెట్ పల్లి పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు నిర్వహించడం జరుగుతుందని మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి అన్నారు. మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మొత్తం 22 అంశాలను సభ్యుల ముందుంచగా, వాటిని కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో కౌన్సిలర్లు పట్టణంలోని పలు సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా వీధి దీపాల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నాణ్యమైన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని వార్డుల్లో వర్షపు నీరు నిల్వ కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో దెబ్బతిన్న కల్వర్టులు, మురికి కాలువలను తక్షణమే పునర్నిర్మించాలని, అలాగే కొత్త సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి



మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తామని, కౌన్సిల్ సభ్యులు ప్రస్తావించిన ప్రతి సమస్యను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వార్డుల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అలాగే శిథిలావస్థలో ఉన్న భవనాలను ప్రజలు వెంటనే ఖాళీ చేసి ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్, డీఈఈ నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రహదారులపై కూలిన చెట్లు

## తొలగించిన జగిత్యాల పోలీసులు - వెంటనే స్పందించి ట్రాఫిక్ పునరుద్ధరణ..

## అత్యవసరం అయితేనే ప్రయాణాలు చేయాలి



జగిత్యాల ప్రతినిధి జులై 30 (ప్రజాకలం)

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలుచోట్ల రహదారులపై చెట్లు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందిన వెంటనే జగిత్యాల జిల్లా పోలీసులు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను యథావిధిగా పునరుద్ధరించారు. బుగ్గారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగాపూర్ గ్రామంలో రహదారిపై చెట్టు కూలిపోవడంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని చెట్టును తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. అదేవిధంగా పెగడపల్లి–రామడుగు ప్రధాన రహదారిపై భారీ చెట్టు కూలిపోవడంతో బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో చెట్టును తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. కొండగట్టు మండలం రాజారం గ్రామ సమీపంలోని హైవేపై రెండు చెట్లు కూలిపోవడంతో పోలీసులు సంబంధిత శాఖల సిబ్బందితో కలిసి వెంటనే చెట్లను తొలగించి హైవేను పూర్తిగా క్లియర్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసులు ప్రజలకు కీలక సూచనలు చేశారు. భారీ వర్షాల సమయంలో అత్యవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయవద్దని, రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు లేదా ఇతర అడ్డంకులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్–100కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని, వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలు పాటించాలని పోలీసులు కోరారు.

# మోడల్ స్కూల్ బ్రిడ్జికి నిధులు ఇవ్వాలి

మల్లాపూర్ జూలై 30 ( ప్రజా కలం ప్రతినిధి)

మల్లాపూర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ బ్రిడ్జి, సీసీ రోడ్డు, వంటగది, స్మశాన వాటిక ప్రహరీ నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ తరపున ఇప్పటివరకు మూడుసార్లు వినతిపత్రాలు అందజేశామని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ తెలిపారు. మోడల్ స్కూల్‌కు వెళ్లే రహదారిని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డం సోమారెడ్డి, వార్డు సభ్యులు, సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆపద సమయంలో సహాయం కోసం

# మూడు ప్రత్యేక రెస్క్యూ బృందాలు

## – జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ వెల్లడి

జగిత్యాల ప్రతినిధి జూలై 30 (ప్రజాకలం)

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు జిల్లా పోలీసు శాఖ పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. వాగులు,వంతెనలు, లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారుల వద్ద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎస్పీ, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన మూడు రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఈ బృందాలకు లైఫ్ జాకెట్లు, తాళ్లు, రెస్క్యూ కిట్లు తదితర భద్రతా పరికరాలు అందుబాటులో ఉంచామని, వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించడం వంటి చర్యలకు వీటిని వినియోగిస్తామని చెప్పారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్న ఎస్పీ, రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టేందుకు పోలీసు బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అవసరమైతే



పడవలు, ఇతర రక్షణ పరికరాలతో సహాయక చర్యలను మరింత వేగవంతం చేస్తామని వెల్లడించారు. ప్రజలు వాతావరణ శాఖ హెచ్చరికలను తప్పనిసరిగా గమనించాలని, అధికారుల సూచనలను పాటించాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని, వాగులు, వంకలు, వరద నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్–100కు సమాచారం అందించాలన్నారు.

# గంజాయి కేసులో ఇద్దరు నిందితులకు 7 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

### రూ.10 వేల జరిమానా విధించిన కోర్టు - మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల ప్రతినిధి జూలై 30 (ప్రజాకలం) జగిత్యాల జిల్లా పెగడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి సరఫరా, అమ్మకాల కేసులో ఇద్దరు నిందితులకు గౌరవ 1వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి. సునీత రవీంద్ర రెడ్డి 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 10 వేల జరిమానా విధిస్తూ కీలక తీర్పును వెలువరించారు. అదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన మెస్త్రం నగేశ్ పెందూర్ లక్ష్మణ్‌లు 2024 ఏప్రిల్ 1న పెగడపల్లి బస్టాండ్ సమీపంలో 2.200 కిలోల గంజాయితో పట్టుబడ్డారు. విశ్వసనీయ సమాచారం మేరకు అప్పటి ఎస్సై జె. రామకృష్ణ తన సిబ్బందితో నిఘా ఏర్పాటు చేసి నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసులో అప్పటి మల్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవి దర్యాప్తు పూర్తి చేసి, శాస్త్రీయ ఆధారాలు, ఫోరెన్సిక్ నివేదికలు, సాక్షుల వాంగ్మూలాలతో చార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితులను దోషులుగా నిర్ధారించి 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధించింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో గంజాయి పెంపకం, రవాణా, నిల్వ, సరఫరా, అమ్మకాల వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ కట్టుబడి ఉందని, ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి సీఐ రవి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బిట్ల నర్సయ్య, సి.ఎం.ఎస్ ఎస్సై ఎస్. శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ హరీష్, సి.ఎం.ఎస్ కానిస్టేబుళ్లు రాజు నాయక్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# భారీ వర్షాలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం

### ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల ప్రతినిధి జూలై 30 (ప్రజాకలం)

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. గురువారం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించి వర్షాల పరిస్థితిపై సమీక్షించారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగించాలని, నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముంపు ప్రమాదం ఉన్న గ్రామాలు, కాలనీలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైతే



ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఆహారం, వైద్య సేవలు వంటి అన్ని మౌలిక వసతులు సిద్ధంగా ఉంచాలని తహసీల్దార్లు, ఎంపీడీఓలకు సూచించారు. తరలించిన ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, నాలాలు బ్లాక్ కాకుండా వెంటనే శుభ్రపరిచి వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు. రోడ్లపై చెట్లు కూలినా వెంటనే తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న లైన్లను పరిశీలించి ప్రమాదాలు నివారించాలని, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఎమర్జెన్సీ బృందాలు, తాగునీటిబృందాలు, యంత్ర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో 24 గంటలు పనిచేయాలని ఆదేశించారు. అధికారులు ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, ఎలాంటి ప్రమాద సమాచారం వచ్చినా వెంటనే స్పందించి జిల్లా కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్లు బి. రాజ్ గౌడ్, బి.ఎస్. లతతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### వరద ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



పెద్దపల్లి,జూలై 30: (ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్,ఇతర ఉన్నతాధికారులతో కలిసి భారీ వర్షాలు,వరద పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.సమీకృత జిల్లా కలెక్టరేట నుంచి జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్ష,ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అతి భారీ నుంచి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన సహాయక చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అధికారులందరూ తమ తమ ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని,అన్ని జిల్లాల్లో 24 గంటల పాటు కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాల్లో నమోదైన వర్షపాతం,జలాశయాల్లో నీటి నిల్వలు,దెబ్బతిన్న రహదారులు, వంతెనలు,చేపట్టిన సహాయక చర్యలపై జిల్లా యంత్రాంగాన్ని అడిగి తెలుసుకున్నారు.ఇప్పటికే పలు జిల్లాల్లో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ,ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైనట్లు సమాచారం అందితే వెంటనే స్పందించాలని ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు టామ్‌టామ్ నిర్వహించాలని సూచించారు.పారిశుద్ధ్య పనులను నిరంతరం కొనసాగించాలని, వైద్యారోగ్య శాఖ అధికారులు అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు,చెరువులు, కుంటలు, నదుల పరిసర ప్రాంతాలకు ప్రజలు,పశుకాపరులు,మత్స్యకారులు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్ మాట్లాడుతూ భారీ వర్షాలు,వరదల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తోందని తెలిపారు.అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని పేర్కొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని,వరద ముంపు ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని,సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ ఈ ఆర్ అండ్ బి భావ్ సింగ్,జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్,ఆర్డీవో గంగయ్య,సంబంధిత శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా కలం

# జర్నలిజం అంటే ఏమిటి?

### చరిత్ర ఎలా మొదలైందంటే.?

సమాజంలో జరుగుతున్న వాస్తవ సంఘటలను ప్రజా మాధ్యమాల ద్వారా ప్రసారం చెయ్యడానికి రాత, దృశ్య, శ్రవణ రీతులలో తయారుచేసే కార్యకలాపం..అంటే సమాజం గురించి సమాజానికే తెలియజేయడం జర్నలిజం. అంటే అంతర్గతంగానే ఉండిపోయే విషయాలను బహిర్గతం చెయ్యడం పాత్రికేయం ఉద్దేశాలు. ఒక జరిగిన సంఘటనను రాసి లేదా చిత్రీకరించడాన్ని తెలుగులో వార్త అని అంటారు. ఈ ప్రక్రియలో పాత్రికేయులు, ఇతరులు భాగస్వాములు. పాత్రికేయం (జర్నలిజం) అనేది ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి, పరిశీలించి, నిజానిజాలను నిర్ధారించి, నిష్పాక్షికంగా ప్రజలకు అందించే వృత్తి, కళ, సామాజిక బాధ్యత, శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలతో పాటు ప్రజల తరఫున అధికారాన్ని ప్రశ్నించే, ప్రజా ప్రయోజనాలను కాపాడే బాధ్యతను పాత్రికేయం నిర్వర్తిస్తుంది కాబట్టి ప్రజాస్వామ్యంలో పాత్రికేయాన్ని "నాలుగో స్థంభం" గా అభివర్ణిస్తారు. నిజమైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం, ప్రభుత్వం, సంస్థలు, అధికార వ్యవస్థలను జవాబుదారీగా ఉంచడం, ప్రజాభిప్రాయాన్ని నిర్మించడానికి వేదిక కల్పించడం, అవినీతి, అక్రమాలు, సామాజిక అన్యాయాలను వెలికితీయడం, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించడం... పాత్రికేయం ప్రధాన లక్ష్యాలు. సత్యనిష్ఠ, నిష్పాక్షికత, కచ్చితత్వం, సమతుల్యత, బాధ్యత, నైతిక విలువలు పరిరక్షించడం మంచి పాత్రికేయం లక్షణాలు. వార్తలను వాస్తవాధారాలతో ధృవీకరించడం, పుకార్లు, అసత్య ప్రచారాలకు దూరంగా ఉండటం, అన్ని పక్షాల అభిప్రాయాలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వడం., ప్రజా ప్రయోజనానికే ప్రాధాన్యం ఇవ్వడం, అధికారాన్ని ప్రశ్నించడంలో ధైర్యం, ప్రజల పట్ల బాధ్యత కలిగి –ఉండడం.. పాత్రికేయుని బాధ్యతలు. పాత్రికేయాన్ని...వార్తా పాత్రికేయం, పరిశోధనాత్మక పాత్రికేయం, రాజకీయ పాత్రికేయం, ఆర్థిక పాత్రికేయం,క్రీడా పాత్రికేయం, విజ్ఞాన, సాంకేతిక పాత్రికేయం, డిజిటల్/మల్టీమీడియా పాత్రికే యంగా విభజించవచ్చు. "వార్త చెప్పడం మాత్రమే పాత్రికేయం కాదు; నిజాన్ని వెలికితీసి, ప్రజలకు నమ్మకమైన సమాచారాన్ని అందించడం, ప్రజా ప్రయోజనాలను కాపాడటం పాత్రికేయం యొక్క అసలు సారాంశం." అమెరికన్ పాత్రికేయుడు జోసెఫ్ పులిట్జర్ చెప్పిన భావం పాత్రికేయ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది: "సమాజ పురోగతికి, సంస్కరణలకు, ప్రజా సేవకు అంకితమైన స్వతంత్ర పత్రికే ప్రజాస్వామ్యానికి నిజమైన బలం." సంక్షిప్తంగా చెప్పాలంటే, పాత్రికేయం ప్రధానంగా ప్రజలు వాస్తవం తెలుసుకునే హక్కును కాపాడే బాధ్యతాయుతమైన ప్రజాసేవ. వార్తను ఇంగ్లీషులో న్యూస్ అంటారు. 17వ శతాబ్దానికి పూర్వం వార్తాపత్రికల ఆవిష్కరణకు ముందు కేంద్రీకృత సామ్రాజ్యాల కాలంలో కొన్ని ప్రభుత్వాలు అధికారిక బులెటెన్లను, ఆజ్ఞలను పంపిణీ చేసేవారు. 14వ శతాబ్దం నాటికే ఇటలీ, జర్మన్ దేశాల నగరాలలో వ్యాపారస్థులు ముఖ్యమైన వార్తా సంఘటనలను చేతిరాత పత్రాలలో కూర్చి వాటిని తమ వ్యాపార సంబంధీకులతో పంచుకునేవారు. ఈ పత్రాలకు ముద్రణ యంత్రాన్ని వాడుకోవాలన్న ఆలోచన 1600 కాలంలో మొదటగా జర్మనీలో వచ్చింది. కొన్ని దశాబ్దాల తర్వాత, పారిస్, లండన్ లలోని జాతీయ ప్రభుత్వాలు అధికారిక వార్తాలేఖలను ముద్రించడం మొదలుపెట్టాయి.వార్తలు ఒకరి నుంచి మరొకరికి ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి చేరడం వలన సమస్యలు పరిష్కరించుకోవడానికి మార్గం సుగమమవుతుంది.ఉదాహరణకు ఒక ప్రాంతంలోని పలు సమస్యలను వార్తా ప్రసార సాధనాలు ప్రసారం చేయడం ద్వారా వెంటనే సంబంధిత శాఖ ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తారు. ఒక సమస్యను ఫిర్యాదు చేయటం ద్వారా పరిష్కారమయ్యే సమయం కన్నా వార్త ప్రసార సాధనాల ద్వారా ప్రచురితమైన సమస్య వేగంగా పరిష్కారమవుతుంది. తాజా ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం, తెలుగు భాషలో నమోదైన పత్రికలు (దినపత్రికలు, వారపత్రికలు, మాసపత్రికలు తదితరాలు కలిపి) మొత్తం సుమారు 4,550 ఉన్నాయి. ఇది ఆంధ్రప్రదేశ్లో నమోదైన తెలుగు ప్రచురణల సంఖ్య మాత్రమే; ఇతర రాష్ట్రాల్లో నమోదైన తెలుగు పత్రికలను కలుపుకుంటే మొత్తం సంఖ్య మరింత పెరుగుతుంది. 2011 గణాంకాల ప్రకారం 2168 తెలుగు పత్రికలు (405 దినపత్రికలు, 372 వారపత్రికలు, 340 పక్ష పత్రికలు, 971 మాసపత్రికలు) ఐఆర్ఎస్ క్యూ-2, తెలుగు న్యూస్ ఏజెన్సీలో ఐఎన్బీ గుర్తింపు పొందిన బీఎన్ఏ, ఏఎన్ఐలు ఉన్నాయి. తెలుగు పత్రికలు టీవీ న్యూస్ చానల్స్ న్యూస్ ఏజెన్సీలు ఉన్నాయి. పత్రికల్లో దిన పత్రిక, వార, పక్ష, మాస పత్రికలు అనేకం ఉన్నాయి.అయితే, భారతదేశంలో మే 2026 నాటికి అన్ని భాషల కలిపి నమోదైన పత్రికలు : దినపత్రికలు – 20,264, సాయంత్రం దినపత్రికలు–769, వారపత్రికలు–46,485, పక్షపత్రికలు– 16,685, మాసపత్రికలు–48,303, త్రైమాసిక పత్రికలు–9,095, ఇతర కాలవ్యవధి ప్రచురణలు కలిపి మొత్తం–1,49,809.

**బొడ్డు బాబురావు**

**- ఉత్తమ సామాజిక సేవ జాతీయ అవార్డు గ్రహీత**

# భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**– కల్వకుంట్ల సుజిత్ రావు**

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 30 (ప్రజా కలం) ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులు మినహా ఎవరూ బయటకు రావద్దని టీపీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్ రావు కోరారు.గురువారం విలేకరులతో మాట్లాడుతూ వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.వరద ప్రవాహం ఉన్న వంతెనలు, కల్వర్టులు, రహదారులను దాటే ప్రయత్నం చేయవద్దని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తెలిపారు. తడిగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు



తాకవద్దని, శివారు ప్రాంతాల్లో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. రైతులు విద్యుత్ బావుల వద్ద అప్రమత్తంగా ఉండాలని, వరద నీరు ప్రవహించే నాలాలు, మ్యాన్‌హోల్స్ సమీపానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గతంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. వర్షాలు, వరదల నేపథ్యంలో సహాయక చర్యలకు అధికారులు సిద్ధంగా ఉన్నప్పటికీ, ముందుగా ప్రజలు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా ప్రమాదం సంభవిస్తే వెంటనే స్థానిక అధికారులకు సమాచారం అందించి సహాయం పొందాలని, ప్రభుత్వం సంబంధిత శాఖలను అప్రమత్తం చేసిందని తెలిపారు.

### తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను

# భావితరాలకు అందించాలి

**- గాయత్రి విద్యానికేతన్ కరస్పాండెంట్ అల్లెంకి రజిని శ్రీనివాస్**




పెద్దపల్లి,జూలై 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని,ఆషాఢ మాసంలో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బోనాలు,గోరింట సంబరాలు మన ఐక్యతకు ప్రతీక అని గాయత్రి విద్యానికేతన్ కరస్పాండెంట్ అల్లెంకి రజిని శ్రీనివాస్ పేర్కొన్నారు.జిల్లా కేంద్రంలోని గాయత్రి డిగ్రీ మరియు పీజీ కళాశాలలో గురువారం బోనాలు మరియు గోరింట సంబరాలు అంబరాన్నంటాయి. గాయత్రి విద్యానికేతన్ కరస్పాండెంట్ శ్రీమతి అల్లెంకి రజిని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి స్వయంగా బోనం ఎత్తుకుని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,తెలంగాణ ప్రాంత సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన బోనాల పండుగలో భాగంగా మహిళలు సాంప్రదాయ దుస్తులతో తలపై బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లడం విశేషమన్నారు. అలాగే ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం మన సంస్కృతిలో భాగమని,ఇది శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడంతో పాటు చేతులకు ఎంత బాగా పండితే జీవితం అంత కలర్‌ఫుల్‌గా ఉంటుందని తెలిపారు.ఈ వేడుకల్లో విద్యార్థినులు,ఉపాధ్యాయురాళ్ళు ఉత్సాహంగా స్వయంగా గోరింటాకు రుబ్బి పెట్టుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు.

# ప్రాణ భయంతో బస్సు ప్రయాణం

**పెద్దాపూర్ మోడల్ స్కూల్ దారికి సీసీ రోడ్డు నిర్మించండి -బీజేవైఎం రాష్ట్ర నాయకులు కంకణాల జ్యోతిబసు**

పెద్దపల్లి,జూలై 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలోని మోడల్ స్కూల్‌కు వెళ్లే రహదారి వర్షాకాలంలో పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో, విద్యార్థులను తరలించే ఆర్టీసీ బస్సులు ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నాయని,దీనివల్ల విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని బీజేవైఎం రాష్ట్ర నాయకులు కంకణాల జ్యోతిబసు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ మార్గం పూర్తిగా పాడవడంతో పాటు భారీ గుంతల్లో నీరు నిలిచి వాహనాలు అదుపుతప్పే ప్రమాదం నెలకొందని,పాఠశాలకు వెళ్లే చిన్నారులు నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వెలిబుచ్చారు.ఇది వందలాది మంది విద్యార్థుల ప్రాణ రక్షణకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశమని పేర్కొంటూ,వారి క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పెద్దపల్లి శాసనసభ్యులు,ప్రభుత్వ విప్ శ్రీ చింతకుంట విజయ



రమణారావు ఈ సమస్యపై తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.తక్షణ తాత్కాలిక మరమ్మతులు కాకుండా,భవిష్యత్తులో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మోడల్ స్కూల్ రహదారిని వెంటనే సీసీ రోడ్డుగా నిర్మించేలా సంబంధిత అధికారులను ఆదేశించి ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

# కుల అభివృద్ధికి జనగణన దిక్సూచి

**ప్రతి కుటుంబం వివరాలు నమోదు చేసుకోవాలి -ఎల్లాపు సంఘం రాష్ట్ర నేతలు**



పెద్దపల్లి,జూలై 30 (ప్రజాకలం జిల్లాప్రతినిధి) సమాజంలో ప్రతి వర్గం అభివృద్ధి చెందాలంటే ఆ వర్గానికి చెందిన వారి సామాజిక,ఆర్థిక స్థితిగతులపై స్పష్టమైన అవగాహన ఉండాలని,ఆ లక్ష్యంతోనే ఎల్లాపు కులస్తుల సమగ్ర జనగణన ప్రక్రియను చేపట్టినట్లు సంఘం రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు.రాష్ట్ర అధ్యక్షులు వీర్ల వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు, ఓదెల మండలం కనపర్తి గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కుల గణన పుస్తకాలను కనగర్తి యూనిట్ ప్రతినిధులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నర్సింగ రావు,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీర్ల రవీందర్ రావు,కరీంనగర్ రూరల్ జిల్లా యూనిట్ అధ్యక్షులు పెంచాల కిషన్ రావు,కరీంనగర్ అర్బన్ ప్రధాన కార్యదర్శి లక్కాకుల సురేందర్ రావు మాట్లాడుతూ కుల అభివృద్ధికి,ఐక్యతకు ఈ జనగణన ఒక దిక్సూచిగా పనిచేస్తుందని ఉద్ఘాటించారు.ప్రతి కుటుంబం తమ వివరాలను ఎటువంటి పొరపాట్లు లేకుండా సక్రమంగా నమోదు చేసుకోవాలని,ఈ గణాంకాలు భవిష్యత్తులో కుల సంఘం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలకు,పాలనాపరమైన నిర్ణయాలకు ప్రాతిపదికగా నిలుస్తాయి అని వారు స్పష్టం చేశారు. అనంతరం కనగర్తి గ్రామ ఎల్లాపు సంఘం నాయకులు రాష్ట్ర మరియు జిల్లా నాయకులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అది బాపురావు,అది శంకర్ రావు,కందునూరి సురేందర్ రావు,గాండ్ల ఐలయ్య,కొట్టె దేవేందర్ రావు,వీర్ల రవీందర్ రావు,రాపోల్ తిరుపతి రావు తోపాటు పలువురు ఎల్లాపు కుల బాంధవులు పాల్గొన్నారు తదితరులు

## హిప్నెల్లిలో భారీ వర్షాలకు కూలిన ఇళ్లు: పాఠశాలలో నిర్వాసితులకు ఆశ్రయం



తానూర్,జులై 30 (ప్రజా కలం ): తానూర్ మండలంలోని హిప్నెల్లి గ్రామంలో ఏకధాటిగా కురుస్తున్న అతి భారీ వర్షాలకు పలువురి ఇళ్ల గోడలు కూలిపోయాయి. గ్రామానికి చెందిన కిష్టాబాయి, భోజవ్వ, లక్ష్మణ్‌లతో పాటు మరికొందరి ఇళ్ల దెబ్బతినడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, విషయం తెలిసిన వెంటనే స్థానిక సర్పంచ్ గంగాసాగర్ – శివరాం దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి, బాధితులను పరామర్శించారు, నిర్వాసితులకు తాత్కాలికంగా ఉండేందుకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో వసతి ఏర్పాట్లు చేశారు, ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.." వర్షాల వల్ల ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉన్నవారు వెంటనే స్థానిక ప్రభుత్వ పాఠశాలకు వచ్చి సురక్షితంగా ఉండాలి" అని కోరారు,ఏమైనా అత్యవసర సహాయం లేదా ఇబ్బందులు ఉంటే బాధితులు 9948926138 నంబరులో సంప్రదించాలని సర్పంచ్ వెల్లడించారు.

### భారీ వర్షాల నేపథ్యంలో

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రమాదకర ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి**

**యామాపూర్-ఫకీర్ కొండాపూర్ గ్రామాల వాగును పరిశీలించిన జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్**



ఇబ్రహీంపట్నం జూలై 30 (ప్రజా కలం ప్రతినిధి) భారీ వర్షాల కారణంగా ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్-ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వాగును జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు.వాగులో ప్రవాహ పరిస్థితులను పరిశీలించి ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.వర్షాల కారణంగా వాగుల ప్రవాహం ఎక్కువ ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు వాటిని దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు.లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి ,పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

## ఎండపల్లి-కొండాపూర్ మధ్య రొడ్డాం వరద నీరు ఉధృతి రాకపోకలు బంద్




ఎండపల్లి, జూలై 30 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం లో భారీ వర్షాల తో ఎండపల్లి–కొండాపూర్ మధ్య ఉన్న రొడ్డాం వరద నీరు ఉధృతంగా ప్రవ హిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరడం తో రహదారిపై ప్రవాహం పెరిగి రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో స్థానికులు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరద ప్రవాహం తగ్గే వరకు ప్రజలు రొడ్డాం దాటకుండా రహదారిపై గ్రామ పంచా యతీ ట్రాక్టర్ ను రోడ్డుకు అడ్డంగా పెట్టారు స్థానికులు ప్రజలు గాని రొడ్డాం దాటేందుకు ప్రజలు ప్రయ త్నించకుండా ప్రత్యా మ్నాయ మార్గాలను ఎంచు కోవాలని గ్రామ సర్పంచ్, పోలీసులు సూచిస్తున్నారు.

## ధర్మారం మండలంలో వరద ప్రాంతాలను పరిశీలించిన సీఐ



ధర్మారం, జులై 30 : ( ప్రజా కలం ప్రతినిధి ) పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని నంది మేడారం ఏడు పంపుల వద్ద వరద ఉధృతిని పరిశీలించిన పెద్దపల్లి సీఐ కె ప్రవీణ్ కుమార్ ధర్మారం మండలం లో వివిధ గ్రామాల లో వరద ప్రాంతాలను పర్యటించి అక్కడ గల వాగులు, కల్వర్టులు, మేడారం లోని ఏడూ పంపుల వద్దకు వెళ్లి వరద వృధృతిని పరిశీ లించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ధర్మారం ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్ పోలీస్ సిబ్బంది పాల్గొ న్నారు. ధర్మారం పోలిసు వారి హెచ్చరిక ప్రజలకు తెలియజేయునది ఎమ నగా వర్షాలు విపరీతంగా పడుతుండడం వలన వాహన దారులు జాగ్రత్తగా వెళ్ళగలరు, వాగులు కల్వర్టులు, రొడ్డాం లు దాటే వారు జాగ్రత్తగా వరద ప్రవాహం చూసుకుని దాటగలరు చేపలు పట్టడానికి ఎవరు వెళ్ళకూడదు, కరెంట్ పోల్స్ కి దగ్గర ఉండడం వాటిని తాకడం చేయ రాదు, పురాతన మైన ఇల్లు ఉన్నవారు జాగ్రత్తగా ఉండగలరు. మీకు ఎలాంటి అత్యవసరం వచ్చిన కూడా డయల్ 100/112 కి కాల్ చేయగలరని ధర్మారం ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## సదర్ మాట్ బ్యారేజ్ పరిశీలించిన జగిత్యాల జిల్లా కలెక్టర్

ఇబ్రహీంపట్నం జూలై 30( ప్రజా కలం ప్రతినిధి )

ఇబ్రహీంపట్నం మండలంలోని సదర్ మాట్ బ్యారేజ్ ని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఎస్పి అశోక్ కుమార్ సందర్శించారు బ్యారేజ్ వరద నీటి ప్రవాహం పెరగడంతో అధికారుల సమక్షంలో మూడు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు నీటి ప్రవాహం బ్యాచ్ భద్రత పరిసరాల ప్రాంతాలను పరిస్థితి కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు పరిస్థితులను వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబదిత అధికారులు పాల్గొన్నారు.



# రామలింగేశ్వర ఆలయ నూతన కమిటీ ఎన్నిక

మల్లాపూర్ జూలై 30 ( ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ మండలం వాల్గొండ గ్రామ ప్రజల ఏకాభిప్రాయంతో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా సాంబారి శంకర్, వైస్ చైర్మన్‌గా చిలువేరి లక్ష్మిని ఎంపిక చేశారు. గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కుల పెద్దలు, వీడీసీ సభ్యులు, ప్రస్తుత--మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ యువత సమక్షంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోపరపు వసంత, తండా సర్పంచ్ సురేష్ పాల్గొన్నారు

# రాజీవ్ రహదారిపై ఉధృత వరద

## - సహాయక చర్యలు చేపట్టిన మున్సిపల్ అధికారులు



పెద్దపల్లి,జూలై 30 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి సాయిగర్డెన్ సమీపంలో రాజీవ్ రహదారిపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, కమిషనర్ ఆకుల వెంకటేష్ తక్షణమే స్పందించి ఘటనాస్థలాన్ని పరిశీలించి సహాయక చర్యలను పర్యవేక్షించారు.వరద నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న పైపులను క్రేన్ సహాయంతో తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా మార్గం సుగమమం చేయగా,మరోవైపు పోలీసులు వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల వైపు మళ్లించి ట్రాఫిక్‌ను నియంత్రించారు.జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ అయినందున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చైర్మన్ నూగిల్ల మల్లయ్య సూచించగా,మున్సిపల్ యంత్రాంగం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు పూదరి అనూష మహేందర్, అక్కపల్లి సుజాత క్రాంతి,టౌన్ ప్లానింగ్ అధికారులు నరేష్,వినయ్,జూనియర్ అసిస్టెంట్ సురేందర్,వార్డు అధికారులు,నాయకుడు ఉనుకొండ రాకేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘరానా దొంగ గంగాధర్ అరెస్ట్

## - బైక్ స్వాధీనం చేసుకున్న పోలీసులు



పెద్దపల్లి,జూలై 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లిలో ద్విచక్ర వాహనం చోరీకి పాల్పడిన రంగు గంగాధర్ అనే నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి,అతని వద్ద నుంచి దొంగిలించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.పెద్దపల్లికి చెందిన మామిడిపల్లి ప్రదీప్ గత నెల జూన్ 20న తన వాహనాన్ని పెద్దపల్లి బస్టాండ్ వద్ద గల ఫార్మసీ ముందు పార్క్ చేయగా చోరీకి గురైంది.బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.నరేష్ కేసు నమోదు చేసి, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించారు.జూలై 29న చీకురాయి చౌరస్తా వద్ద నిర్వహించిన వాహన తనిఖీలలో జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం రాజక్కపల్లికి చెందిన నిందితుడు గంగాధర్ (31) దొంగిలించిన బైక్‌తో పట్టుబడ్డాడు.నిందితుడిపై ఇప్పటికే వివిధ పోలీస్ స్టేషన్లలో 9 కేసులు ఉన్నట్లు సీఐ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ నిమిత్తం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామని,సమర్థవంతంగా కేసును ఛేదించిన ఎస్ఐ కె.నరేష్‌తో పాటు కానిస్టేబుళ్లు ప్రభాకర్,సతీష్‌లను సీఐ అభినందించారు.

# డీజీపీ కార్యాలయం నుంచి గోదావరి పుష్కరాలు-2027 భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర స్థాయి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం

నిర్మల్ జూలై 30(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

గోదావరి పుష్కరాలు-2027 సందర్భంగా భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై డీజీపీ కార్యాలయం నుంచి ఏడీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ మురళీధర్ భగవత్, ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, పాల్గొన్నారు.
సమీక్ష సందర్భంగా సీసీటీవీ నిఘా, డ్రోన్ సర్వైలెన్స్, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర స్పందన బృందాలు, పార్కింగ్, బ్యారికేడింగ్ తదితర భద్రతా ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేసి పుష్కరాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో , ఏ ఓ ఎండి యూనస్ అలీ నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ సోన్ సీఐ గోవర్ధన్ రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# దాసరి ని ఎదుర్కోలేకనే నీచ రాజకీయాలు

## - దాసరి పై దుష్ప్రచారం సహించేది లేదన్న బీఆర్ఎస్ శ్రేణులు



పెద్దపల్లి,జూలై 30:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

రైతుల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు అపూర్వ స్పందన లభించడంతో తట్టుకోలేకపోయిన కాంగ్రెస్ నాయకులు ఆయనపై వ్యక్తిగత దూషణలకు దిగడం సిగ్గుచేటని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను, సాగునీరు,నాణ్యమైన కరెంటు,ఎరువుల కొరత వంటి సమస్యలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ నేతలు దిగజారి ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.మనోహర్ రెడ్డి పదేళ్ల పాలనలో 24 గంటల విద్యుత్,సకాలంలో రైతు బంధు,బీమా,గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ఘనత ఆయనదేనని,నేడు ఆయనను విమర్శిస్తున్నవారంతా గతంలో ఆయన నీడలోనే పదవులు అనుభవించినవారేనని గుర్తుచేశారు.పార్టీలో ఎలాంటి అంతర్గత విభేదాలు లేవని స్పష్టం చేసిన నేతలు,రానున్న ఎన్నికల్లో పెద్దపల్లి టికెట్ దాసరి మనోహర్ రెడ్డికే దక్కుతుందని,ఆయన భారీ విజయం సాధించడంతో పాటు రాష్ట్రంలో మళ్లీ గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి వంగల తిరుపతిరెడ్డి,మాజీ ఎంపీపీ నూనెటి సంపత్ యాదవ్,మోహన్ రావు,మండల అధ్యక్షులు మార్కు లక్ష్మణ్, బైరం రామ్ రెడ్డి,మాజీ సింగిల్ విండో చైర్మన్ సందీప్ రావు,కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్,నాయకులు గుణపతి,మోబిన్, దయాకర్,పెంచల శ్రీధర్,పూదరి చంద్రశేఖర్, కొయ్యడ అరుణ్,సంపత్,బాబు రావు,కాశిపాక వాసు, ముఖిమ్,సదయ్య, రఫీక్,పల్లె మధు,కుక్క మనోజ్,తిరుపతి రెడ్డి,సతీష్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ రూరల్ పోలీసుల చాకచక్యంతో భారీ చోరీ కేసులో మరో నిందితురాలు అరెస్ట్

కరీంనగర్ ప్రతినిధి జులై 30 (ప్రజాకలం)

కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన భారీ చోరీ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకు న్న కరీంనగర్ రూరల్ పో లీసులు ఇప్పటికే ప్రధాన నిందితుడైన జడ్పీటీసీ భర్త తగరం శంకర్ ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే.
ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం సుమారు 3.30 గంటల సమయం లో, కరీంనగర్ రూరల్ సీ ఐ ఏ. నిరంజన్ రెడ్డి కి అం దిన విశ్వసనీయ సమాచా రం మేరకు, ఆయన తన సిబ్బందితో కలిసి తీగల గుట్టపల్లి రైల్వే స్టేషన్కు వెళ్లి అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ మహిళ ను అదుపులోకి తీసుకుని విచారించారు.విచారణలో ఆమె తన పేరు ఆడె పు రేష్మా, కేశవపట్నం మండలం చింతగుట్టపల్లి గ్రామానికి చెందినదని, అ లాగే ఈ కేసులో మొదటి నిందితుడైన తగరం శం కర్‌కు సన్నిహితురాలినని తెలిపింది. నిన్న తగరం శంకర్‌ను కరీంనగర్ రూ రల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన వి షయం గురువారం పత్రి కలు, టీవీ వార్తల ద్వారా తెలుసుకొని, తనను కూ డా పోలీసులు అరెస్ట్ చేస్తా రనే భయంతో బంధువుల ఇంటికి వెళ్లేందుకు చంద్రా పూర్‌కు వెళ్లే రైలు కోసం తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్‌లో వేచి ఉండగా పోలీ సులు పట్టుకున్నారని తె లిపింది.తదుపరి విచార ణలో, దొంగతనం జరిగిన రోజున తాను మరియు త గరం శంకర్ కలిసి తీగల గుట్టపల్లిలోని ఫారెస్ట్ అ ధికారి శ్రీనివాస్ ఇంటిలోకి ప్రవేశించి, ఇంటి తాళాలు పగులగొట్టి, అనంతరం బాత్రూమ్ తాళం కూడా పగులగొట్టి, అక్కడ ప్లాస్టిక్ నీళ్ల ఖాళీ డ్రమ్ములో దాచి పెట్టిన




సుమారు రూ.26 లక్షల నగదును అపహరిం చినట్లు అంగీకరించింది.
దొంగిలించిన డబ్బులో త నకు కూడా కొంత వాటా ఇ స్తానని తగరం శంకర్ చె ప్పినప్పటికీ, అనంతరం అతడు తన స్వగ్రామానికి వెళ్లిపోయాడని, డబ్బు పంపిస్తానని చెప్పి పంపలే దని, తాను ఎదురు చూస్తుండగా అతడిని పోలీ సులు అరెస్ట్ చేశారని తెలి పింది.తగరం శంకర్‌తో తా ను నిరంతరం మాట్లాడేం దుకు ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను కూడా పంచుల సమక్షంలో స్వ చ్ఛందంగా చూపించి అప్ప గించింది. తన ప్రమేయా న్నిపూర్తిగా అంగీకరించ డంతో, పంచనామా నిర్వ హించి, నిందితురాలిని అ దుపులోకి తీసుకుని పోలీ స్ స్టేషన్‌కు తరలించి, అనంతరం రిమాండ్ నిమిత్తం న్యాయస్థానం ఎదుట హాజరుపరిచినట్లు పోలీ సులు తెలిపారు.ఈ కేసులో మిగిలిన అంశాలపై ద ర్యాప్తుకొనసాగుతున్నదని కరీంనగర్ రూరల్ ఇన్స్పె క్టర్ ఆఫ్ పోలీస్ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.

# నిర్మల్ పోలీస్... మీ పోలీస్...

## -ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల,




నిర్మల్, 30(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, స్టేషన్ నిర్వహణ, మాల్ఖానా, ఆయుధాగారం, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు,అనంతరం పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎస్పీ, ప్రతి ఫిర్యాదును సకాలంలో నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రజా విశ్వాసాన్ని మరింత పెంపొందించే విధంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు,సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మత్తు పదార్థాల నిర్మూలన, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, రాత్రి గస్తీని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. బీట్ వ్యవస్థను బలోపేతం చేసి గ్రామస్థాయిలో ప్రజలతో సమన్వయం పెంచాలని తెలిపారు, ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వాగులు, వంకలు, చెరువులు, లోతట్టు ప్రాంతాల వద్ద ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేలా పోలీసు సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు,ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఖానాపూర్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ రాహుల్, పోలీసు అధికారులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో కడెం ప్రాజెక్టును సందర్శించి వరద పరిస్థితులను సమీక్షించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల

నిర్మల్ జూలై 30(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) జిల్లాలో మొన్న రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, గురువారం కడెం ప్రాజెక్టును సందర్శించి వరద పరిస్థితులను పరిశీలించారు. ప్రాజెక్టు నీటి మట్టం, ప్రవాహ పరిస్థితులు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, ప్రజల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రాబోయే రెండు రోజుల పాటు కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు జిల్లా పోలీసు శాఖ అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని తెలిపారు. అలాగే కడెం ప్రాజెక్టు, ఇతర వాగులు, వంకలు, చెరువులు, నీటి ప్రవాహ ప్రాంతాల వద్దకు ఎవరూ వెళ్లరాదని, సెల్ఫీలు లేదా వీడియోలు తీసేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. గొర్రెలు, పశువుల కాపరులు, మత్స్యకారులు నీటి ప్రవాహ ప్రాంతాలకు వెళ్లకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలను దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని స్పష్టం చేశారు.గ్రామాలు, పట్టణాల్లో పాత ఇళ్లు, గుడిసెలు,



శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివసిస్తున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ల సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఆపత్కాల పరిస్థితులు ఏర్పడినా వెంటనే స్పందించి ప్రాణనష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, ఐఏఎస్, డీఆర్‌డీఓ పీడీ విజయలక్ష్మి, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, కడెం మండల తహసీల్దార్, ఎంపీడీవో, విద్యుత్ శాఖ ఏఈ, కడెం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఖానాపూర్ సీఐ సత్యనారాయణ, సంబంధిత శాఖల అధికారులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వరద నీటి ప్రాంతాలను పరిశీలించిన తహసీల్దార్, ఎంపిడిఓ



గొల్లపల్లి జూలై 30 ప్రజాకలం ప్రతినిధి గొల్లపల్లి మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. 82.4మి. మీ కురిసిన వర్షం దాటికి మండలంలోని పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమల జలమయమయ్యాయి.గ్రామాలలోని వాగులు ,చెరువులు మత్తళ్లు పొంగిపొర్లుతున్నాయి.వాగుల,చెరువుల దగ్గర ఉన్న వరి నాట్లు వేసిన పొలాలు నీట మునిగాయి .మండలంలోని బొంకూరు గ్రామంలోని వంతెన మునిగి రాకపోకలు స్తంభించగా వాటిని తహసీల్దార్, ఎంపిడిఓ పరిశీలించారు.గొల్లపల్లి మండల కేంద్రంలోని బెస్తపల్లి 11వ వార్డులో ఇండ్లలోకి నీరు చేరడంతో బురదమయంగా మారింది. లొత్తునూర్ గ్రామంలోని చెరువులోకి భారీగా వరద నీరు రావడంతో అందులో ఉన్న రైతులు భూములు వరి నాటు వేసేందుకు సిద్ధం చేసిన పొలాలు నీటమునిగాయి. తహసీల్దార్ మాజీద్, ఎంపీడీవో రవీందర్ రావు, ఆర్.ఐ ఎడ్ల జీవన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాపల్లి గంగన్న ఉప సర్పంచ్ గురిజాల బుచ్చిరెడ్డి పరిశీలించారు.

# కూలిన ఇళ్లను పరిశీలించిన డీఎస్పీ

## బాధితులకు అండగా ఉంటామని భరోసా..

## శిథిల భవనాల్లో ఉండొద్దు - డీఎస్పీ రాములు

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూలై 30 (ప్రజా కలం)



పట్టణంలోని మూడో వార్డులో భారీ వర్షాల కారణంగా కూలిపోయిన ఇళ్లను డీఎస్పీ రాములు గురువారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయనతో పాటు సీఐ సురేష్ బాబు, ఎస్ఐ కిరణ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం బాధిత కుటుంబాలతో మాట్లాడిన అధికారులు ప్రమాదం జరిగిన తీరు, ఆస్తి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాములు మాట్లాడుతూ బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జరిగిన నష్టంపై సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రభుత్వ పరంగా తగిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీఐ సురేష్ బాబు మాట్లాడుతూ వర్షాకాలంలో పాతబడిన, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న భవనాలను వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, ఎలాంటి ప్రమాద సూచనలు కనిపించినా వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# పొంగిపొర్లుతున్న ఝరి(బి) బ్రిడ్జి.. రాకపోకలు బంద్!



తానూర్, జులై 30(ప్రజా కలం): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఝరి(బి) గ్రామంలోని లోతట్టు బ్రిడ్జీపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించి, దీంతో గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి,మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, తహశీల్దార్ మహేందర్‌నాథ్, ఎంపీడీఓ శ్రీధర్ ఇతర అధికారులతో కలిసి బ్రిడ్జిని పరిశీలించారు,ఈ సందర్భంగా పొంగిపొర్లుతున్న వాగులను దాటేందుకు ప్రయత్నించవద్దని ప్రజలకు, రైతులకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



# రోడ్డు ప్రమాదం కేసులో నేరస్తుడికి రెండేళ్ల జైలు

## - 5000 వేల రూపాయల జరిమానా

ధర్మారం, జూలై 30 : ( ప్రజా కలం ప్రతినిధి ) తేదీ 02.05.2020 రోజున ఎర్రగుంటపల్లి వద్ద జరిగిన రోడ్డు ఆక్సిడెంట్ లో నేరస్తుడు అయినా గంగుల రవీందర్ పైడిపల్లి గ్రామస్తుడు అను వారి పై అప్పటి ఎస్ ఐ కె ప్రేమ్ కుమార్ కేసు నమోదు చేసి ఛార్జ్ షీట్ వేయడం జరిగింది. ఇట్టి కేసు లో గురువారం రోజున గౌరవ జె ఎఫ్ సి ఎం నంది మేడారం సాక్షులను విచారించి నేరస్తుడు అయినా గంగుల రవీందర్ కు రెండు సంవత్సరాల జైలు శిక్ష, 5000/- ఫైన్ మరియు మోటార్ వెహికిల్ చట్టం కింద మూడు నెలల జైలు, 2000 రూపాయల ఫైన్ విధించడం జరిగింది. ఇట్టి కేసులో పొలిసు వారి తరపున వాదనలు వినిపించిన ఏపీపీ రాకేష్, మరియు సాక్షులను సరైన సమయం లో ప్రవేశ పెట్టిన కోర్టు విధుల కానిస్టేబుల్ సంతోష్ లను జడ్జి అభి నందించడం జరిగిందని ధర్మారం ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# వర్షాభావంలో వరి వద్దు..

## ప్రత్యామ్నాయ పంటలే మేలు




నాగర్ కర్నూల్, జూలై 30 (ప్రజా కలం) నాగర్‌కర్నూల్ జిల్లాలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల సాగు వైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ సూచించారు. అలాగే భూగర్భ జలాల సంరక్షణ, గ్రామాల్లో తాగునీరు–పారిశుధ్యం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల వేగవంతం, ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

# పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

**– జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్**

**– ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటిస్తూ నాణ్యమైన బోధన అందించాలి**

**– ఖమ్మం నగరం 8వ డివిజన్ వైఎస్ఆర్ కాలనీ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**



ఖమ్మం జూన్ 30 ( ప్రజా కలం న్యూస్ ) విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల శ్రేయస్సు, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం కల్పించడంలో ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం ఖమ్మం కార్పోరేషన్ పరిధి 8వ డివిజన్ వైఎస్ఆర్ కాలనీ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మౌళిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, ప్రతి విద్యార్థికి అన్ని సౌకర్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, పాఠశాల వయస్సు గల ప్రతి ఒక్క విద్యార్థి కూడా విద్యకు దూరం కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని అన్నారు. పరిశుభ్రమైన వాతావరణం విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభ్యాసానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని కలెక్టర్ ప్రోత్సహించారు. విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల శ్రేయస్సు, పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం కల్పించడంలో ఉపాధ్యాయులు, అధికారులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పాఠశాలలోని మధ్యాహ్న భోజనం అన్నం, ఆకుకూరల పప్పు, సాంబారు, రాగిజావ ను పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతతో పాటు పరిశుభ్రత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఆహార పదార్థాల నిల్వ, వంట ప్రక్రియ, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, విద్యా శాఖ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# తెలంగాణ జన సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షుడుగా మాదాసు శ్రీనివాస్ రావు నియామకం



ఖమ్మం జులై 30(ప్రజా కలం న్యూస్ )

తెలంగాణ జన సమితి ఖమ్మం జిల్లా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం గురువారం మరియు సెంటర్ లో శ్రీధర్ హోటల్ నందు జరిగింది . ఈ సమావేశానికి పార్టీ పరిశీలకుడు రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి శ్రీనివాస్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ కుమార్ , గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం నరసయ్య హాజరయ్యారు . ఈ సమావేశానికి హాజరైన ప్రతినిధుల అభిప్రాయాలు స్వీకరించి పార్టీ జిల్లా అధ్యక్షులుగా పార్టీ సీనియర్ నాయకుడు తెలంగాణ ఉద్యమకారుడు మాదాసు శ్రీనివాస్ రావును నియమించారు . ఈ నియామకాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం కోదండరాం ఆదేశాలు మేరకు పార్టీ సభ్యుల అభిప్రాయం మేరకు ఈ నియామకం చేసినట్టు పార్టీ పరిశీలకులు అంబటి శ్రీనివాస్ , వినయ్ , ఎం నరసయ్య లు వెల్లడించారు . ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు , నగర జిల్లా అధ్యక్షుడు జావిద్ , పార్టీ సీనియర్ నాయకుడు బట్టు రాజేందర్ నాయక్ , బెల్లంకొండ నాగేశ్వరావు , తిప్పర్తి రామాచారి , వీరేల్లి వాసు , పసుపులేటి విజయ్ , వెంకటేశ్వర్లు , జి రజిని తదితరులు పాల్గొన్నారు .

# ఉప సర్పంచుల జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు ఎన్నిక

ప్రజా కలం జూలై 30 (గద్వాల ప్రతినిధి)జోగులాంబ గద్వాల జిల్లా ఉప సర్పంచుల అధ్యక్షుడిగా వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామ ఉపసర్పంచ్ నాగరాజును



ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గద్వాల జిల్లా డిప్యూటీ కలెక్టర్ రాజ్ కుమార్ అద్యర్యం లో గురువారం జిల్లా కేంద్రం లో ఉప సర్పంచ్ ల జిల్లా అధ్యక్షుడు నీ ఎన్నుకోవడం జరిగింది . ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఉప సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్లా కార్తిక్, ఉపాధ్యక్షుడు పురుషోత్తం, వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జిల్లాలోని ఉప సర్పంచ్ లు కలిసి నన్ను అధ్యక్షుడిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందని, అందులో భాగంగానే మా వారికి ఎవరికైనా ఎలాంటి సమస్య వచ్చినా తీర్చడానికి కృషి చేస్తానని, వారి అండదండలు నాకు ఉండాలని, మా వారికి ఏ సమస్య వచ్చినా వారి అండదండలతో తీర్చడానికి ప్రయత్నం చేస్తానని, నన్ను జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని నాగరాజు అన్నారు.

# ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

## – అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 30:

జిల్లాలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భారత్‌మాల జాతీయ రహదారి, రైల్వే లైన్ డబ్లింగ్, టీజీఐఐసీ బ్రహ్మోస్ క్షిపణి తయారీ పారిశ్రామిక పార్కు, ఉదండపూర్ ఆర్ అండ్ ఆర్, తదితర ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిని ఆమె సమీక్షించారు. ముందుగా జిల్లాలో భారత్‌మాల జాతీయ రహదారి ప్రాజెక్టుకి సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులు, అవార్డులు పూర్తయిన భూయజమానులకు పరిహారం చెల్లింపులు, మ్యుటేషన్ ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గత సమావేశంలో లేవనెత్తిన పెండింగ్ పనులకు సంబంధించి తీసుకున్న చర్యలపై కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటిదాకా సేకరించిన భూమికి సంబంధించిన పరిహారం చెల్లింపులను లబ్ధిదారుల ఖాతాలలో వేగవంతం చేయాలని అన్నారు. వివాదాస్పద భూములకు సంబంధించిన అంశాలను వెంటనే పరిష్కరించి చెల్లింపులు పూర్తి చేయాలని చెప్పారు. రైల్వే లైన్ డబ్లింగ్‌కు సంబంధించిన భూసేకరణలో అవార్డులు, విచారణలు, పెండింగ్ భూసేకరంకు సంబంధించిన ప్రక్రియలను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల అభ్యంతరాలు ఉన్న ప్రాంతాల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసి సమావేశాలు నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. రైల్వే అధికారుల సమన్వయ లోపంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి సమావేశానికి వేర్వేరు అధికారులు హాజరవుతుండటంతో కమ్యూనికేషన్‌లో అంతరాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఇకపై వారంలో ఒకటి లేదా రెండు రోజులు మహబూబ్‌నగర్ ప్రాజెక్టుకు కేటాయించి సంబంధిత అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణలో ఈ రైల్వే ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినదని, శాఖల మధ్య సమన్వయం పెంచాలని చెప్పారు. దేవరకద్ర మండలంలో బ్రహ్మోస్ క్షిపణి తయారీ పరిశ్రమకు సంబంధించిన భూసేకరణ పనులను కూడా వేగవంతం చేయాలని అన్నారు. టీజీఐఐసీ అధికారులు, జిల్లా అధికారులు సమన్వయంతో పని చేసి భూసేకరణను వేగవంతం చేయాలని అన్నారు. ముందుగా ప్రభుత్వ భూమిని సర్వే చేసి, ఎలాంటి ఆక్రమణలు లేని సుమారు 63 ఎకరాలను అడ్వాన్స్ పొజిషన్ ద్వారా వెంటనే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి, జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టుల పనులు ఎలాంటి జాప్యం లేకుండా ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లాలో మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ (ఎం.జి.కె.ఎల్.ఐ.) ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, అవార్డుల జారీ, పనుల పురోగతిపై కూడా కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఇప్పటివరకు ఎంత భూమికి డిక్లరేషన్లు జారీ అయ్యింది, ఎన్ని అవార్డులు పెండింగ్‌లో ఉన్నాయి అనే విషయాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణయించిన కాలపట్టిక ప్రకారం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

# 2025-26 ఖరీఫ్, రబీ సీఎంఆర్ డెలివరీలను వేగవంతం చేయాలి

## – సివిల్ సప్లైస్ డైరెక్టర్ శ్యాంప్రసాద్ లాల్



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 30:

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ గురువారం మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించి 2025–26 ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) డెలివరీల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా భూత్పూర్ మండలంలోని భాను పార్బాయిల్డ్ రైస్ మిల్, తాటికొండలోని నరహరి పార్బాయిల్డ్ రైస్ మిల్‌ను తనిఖీ చేసి మిల్లింగ్ ప్రక్రియ, బియ్యం నిల్వలు, సీఎంఆర్ సరఫరా పురోగతిని పరిశీలించారు. తనిఖీ సందర్భంగా మిల్లర్లతో మాట్లాడిన డైరెక్టర్, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సీఎంఆర్ డెలివరీలను ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతం చేయాలని ఆదేశించారు. మిల్లింగ్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి బియ్యం సరఫరాను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన జిల్లా పౌర సరఫరాల అధికారులు (డీసీఎస్‌వోలు), జిల్లా మేనేజర్లు (డీఎంలు), ఎఫ్‌సీఐ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2025–26 ఖరీఫ్, రబీ సీజన్ సీఎంఆర్ డెలివరీలపై జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న డెలివరీలను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు, రైస్ మిల్లర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తిచేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఎప్పటికప్పుడు పురోగతిని పర్యవేక్షిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. మహబూబ్ నగర్ డి.ఎస్.ఓ గంప శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 ఉచిత కోచింగ్ ను బీసీ యువత సద్వినియోగం చేసుకోవాలి

**– జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**– అర్హులైన ప్రతి బీసీ అభ్యర్థి గడువులోగా లాంగ్ టర్మ్ కోచింగ్ కు దరఖాస్తు చేసుకోవాలి**

**– యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 ఉచిత లాగ్ టర్మ్ కోచింగ్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**

ఖమ్మం, జూలై 30 (ప్రజా కలం న్యూస్ )

ప్రభుత్వం ప్రతిభావంతులైన బీసీ యువతకు కల్పిస్తున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 ఉచిత కోచింగ్ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకుని, అత్యున్నత సివిల్ సర్వీసుల లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో టీజీ బీసీ స్టడీ సర్కిల్, ఖమ్మం ఆధ్వర్యంలో నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్–2027 దీర్ఘకాలిక ఉచిత కోచింగ్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి పరిపాలనలో ప్రతిభావంతులైన యువత భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూర్తి ఉచితంగా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ కోచింగ్‌ను అందిస్తూ, బీసీ విద్యార్థులకు అండగా నిలుస్తోందన్నారు. గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన యువత కూడా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత సర్వీసులను లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగేందుకు ఈ కోచింగ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 2026, ఆగస్టు 24 నుంచి 2027, మే నెల వరకు పూర్తిగా ఉచిత కోచింగ్ అందించనున్నట్లు తెలిపారు. నాణ్యమైన బోధనతో పాటు, కోచింగ్ సామగ్రి, గ్రంథాలయ సదుపాయం, కరెంట్ అఫైర్స్ మెటీరియల్, అనుభవజ్ఞులైన అధ్యాపకుల శిక్షణ, రెగ్యులర్ పరీక్షలు, మాక్ టెస్టులు, వ్యక్తిత్వ వికాస శిక్షణ, ఇంటర్వ్యూ మార్గదర్శకత్వం వంటి అన్ని సౌకర్యాలు ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం కోచింగ్ కార్యక్రమానికి మొత్తం 150 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వీరిలో 100 మందిని ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష ద్వారా, మరో 50 మందిని ఇప్పటికే యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

ఎంపికైన అభ్యర్థులకు స్టైపెండ్, అదనంగా ఒకేసారి పుస్తకాల



గ్రాంట్ అందజేస్తామని అన్నారు. ఈ ఆర్థిక ప్రోత్సాహకాలు విద్యార్థులు పూర్తిస్థాయిలో పోటీ పరీక్షలపై దృష్టి కేంద్రీకరించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన విద్యార్థులకు కూడా ఈ సమాచారాన్ని చేరవేసేందుకు అధికారులు ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతిభకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలను అమలు చేస్తోందని, యువత పట్టుదలతో శ్రమిస్తే అత్యున్నత లక్ష్యాలను తప్పకుండా చేరుకోగలరని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, బీసీ,ఎస్సి, ఎస్టీ వర్గానికి చెందినవారై ఉండాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ 2026 ఆగస్టు 7 వరకు కొనసాగుతుందని, ఆగస్టు 16న ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష, ఆగస్టు 19న ఫలితాలు, ఆగస్టు 21 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఆగస్టు 24 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అర్హతలు, ఎంపిక విధానం, దరఖాస్తు ప్రక్రియ తదితర పూర్తి వివరాలను టీజీ బీసీ స్టడీ సర్కిల్ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించి గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి జి. జ్యోతి, డైరెక్టర్ బీసీ స్టడీ సర్కిల్ గోన శ్రీలత, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి మాధవి, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకట్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు, టీజీ బీసీ స్టడీ సర్కిల్ ప్రతినిధులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో మోటార్ సైకిల్ చోరీ ముఠా గుట్టురట్టు

**కూసుమంచి,ఖమ్మం రూరల్ పోలీసుల సంయుక్త ఆపరేషన్ విజయవంతం.**




పాలేరు జూలై 30( ప్రజా కలం న్యూస్)

కూసుమంచి, ఖమ్మం రూరల్ పోలీసుల సంయుక్త కృషితో ఖమ్మం జిల్లాలో మోటార్ సైకిల్ చోరీలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు ఛేదించారు. వాహనాల తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, ఖమ్మం రూరల్, ఖమ్మం III టౌన్, ఖానాపురం హవేలి, కూసుమంచి, సూర్యాపేట జిల్లా మోతే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పలు మోటార్ సైకిల్ చోరీ కేసుల్లో వారి ప్రమేయం ఉన్నట్లు వెల్లడైంది.

విచారణలో ప్రధాన నిందితుడు చిలకబత్తిని వెంకటేష్ తనతో పాటు నలుగురు బాల నేరస్తులతో కలిసి రాత్రి వేళల్లో డూప్లికేట్ తాళాలతో మోటార్ సైకిళ్లను చోరీ చేసి, వాటిని వివిధ వ్యక్తులకు విక్రయించినట్లు ఒప్పుకున్నాడు. ఈ కేసులో మండవ సాయి, కొక్కు రోనక్, రామాల మహేందర్, ప్రసాదం రాజు (రిసీవర్)లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నలుగురు బాల నేరస్తులను జువెనైల్ జస్టిస్ చట్టం ప్రకారం జువెనైల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరిచారు. ప్రధాన నిందితుడు వెంకటేష్ ప్రస్తుతం పరారీలో ఉండగా, అతని కోసం గాలింపు కొనసాగుతోంది. నిందితుల స్వచ్ఛంద ఒప్పుకోలు, వారు చూపిన ఆధారాల మేరకు మొత్తం 9 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు, వివిధ పోలీస్ స్టేషన్‌లలో నమోదైన 9 మోటార్ సైకిల్ చోరీ కేసులను ఛేదించారు.

# ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు పెరిగిన వరద.. 10 గేట్లు ఎత్తివేత

**– అర్ధరాత్రి దాటిన తర్వాత పది గేట్లు ఎత్తివేత**

**– అన్నదాతల కళ్ళలో ఆనందం**

ప్రజా కలం జూలై 30 (గద్వాల ప్రతినిధి)

జూరాలకు వరద తీవ్రత పెరిగిన నేపథ్యంలో గురువారం తెల్లవారు జామున ఒంటి గంట ప్రాంతంలో అధికారులు పది గేట్లు ఎత్తివేశారు. గత వారం రోజులుగా కర్ణాటక రాష్ట్రంలోని ఆల్మట్టి నుంచి నీటిని ఉండేలా చేస్తుండడంతో నారాయణపురం మీదుగా 30 వేల క్యూసెక్కుల జలాలు జూరాలకు చేరుతూ వచ్చాయి. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలలో పుష్కలంగా వర్షాలు కురుస్తుండడంతో బుధవారం 1, 35,620 క్యూసెక్కులను దిగువకు విడుదల చేయడం, బీమా నుంచి 60 వేల క్యూసెక్కుల జలాలు వస్తూ ఉండడంతో దాదాపుగా రెండు లక్షల క్యూసెక్కుల నీరు మక్తల్ నియోజకవర్గం తంగడి వద్ద ఉమ్మడి పాలమూరు జిల్లాలో కృష్ణా నదికి వచ్చి చేరుతున్నాయి. దీనితోపాటు జూరాల ఎగువ భాగంలోను గత రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద తీవ్రత మరింతగా పెరిగింది. దీంతో జూరాల ప్రాజెక్టు కు సంబంధించి ముందస్తు జాగ్రత్తగా గురువారం తెల్లవారుజామున పది గేట్లు ఎత్తివేసి 44,254 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ మధ్యాహ్నం వరద తీవ్రత పెరగనున్న నేపథ్యంలో జూరాల వద్ద మరి మీ గేట్లను ఎత్తివేసే అవకాశం ఉంది. బీమాకు 1300 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ 492, నెట్టెంపాడు 1044 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేస్తున్నారు. ఆర్డీఎస్ కు నీటిని విడుదల చేయాల్సి ఉంది.

# భారీ వర్షాల కారణంగా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**– కొయ్యూరు ఎస్ఐ మహేందర్ కుమార్**

మల్హర్, జులై 30 ప్రజాకలం ప్రతినిధి : మండలంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కొయ్యూరు ఎస్ఐ పి. మహేందర్ కుమార్ సూచించారు. వర్షాల కారణంగా మానేరు నది, వాగులు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున మత్స్యకారులు, పశువుల కాపరులు చేపల వేటకు వెళ్లకూడదని తెలిపారు. ప్రజలు అత్యవసరమైతేనే బయటికి వెళ్లాలని, నదులు, చెరువుల వద్ద ఫోటోలు, సెల్ఫీలు తీసుకోవద్దని హెచ్చరించారు.



పాడుబడిన, ప్రమాదకరంగా ఉన్న ఇళ్లలో నివసించే వారు వెంటనే వాటి నుండి బయటకు రావాలని పేర్కొన్నారు. అలాగే తడిచిన విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్–100కు కాల్ చేయాలని కోరారు.

## బైర్యాన్‌పల్లి ఆలయ రథచక్రాల
# అభివృద్ధికి రూ.3 లక్షల విరాళం

### ఆధ్యాత్మిక సేవలో మరోసారి ముందున్న బీసీ సేన జిల్లా అధ్యక్షుడు సదర్ శ్రీను

(నందిగామ జులై 30 ప్రజా కలం ప్రతినిధి )ఆలయాల అభివృద్ధి అనేది కేవలం



నిర్మాణాలకే పరిమితం కాకుండా సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కూడా దోహదపడుతుందని బీసీ సేన రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సదర్ శ్రీను అన్నారు. కేశంపేట మండలం బైర్యాన్‌పల్లి గ్రామంలోని ఆలయ రథచక్రాల అభివృద్ధి కోసం ఆయన రూ.3 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆలయాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం, సామాజిక ఐక్యతను పెంపొందించే కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు. భక్తులు, దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆలయాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజ హితం, ధార్మిక కార్యక్రమాల అభివృద్ధి కోసం తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు. సదర్ శ్రీను అందించిన విరాళానికి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహాయం రథచక్రాల నిర్మాణం, ఆలయ అభివృద్ధి పనులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన సదర్ శ్రీను సేవలు ప్రశంసనీయమని అభినందించారు.

## ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం ముగింపు




( వరంగల్/ పర్వతగిరి) జూలై 30, ప్రజాకలం ప్రతినిధి

పర్వతగిరి మండలంలోని అన్ని ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేయుచున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఆరు రోజులపాటు జరిగిన శిక్షణ గురువారం ముగిసినట్లు పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి తెలిపారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఉపాధ్యాయులు తమ నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులకు సులభతరమైన రీతిలో బోధించాలని అన్నారు. తరగతిగది బోధనను సులభతరం చేయుటకు, బోధనలో నూతన ఒరవడిని నేర్చుకొనుటకు ఇలాంటి శిక్షణ తరగతులు అవసరమని అన్నారు. ఈ శిక్షణ తరగతులలో రిసోర్స్ పర్సన్ లు గా ఉపాధ్యాయులు కిషోర్, ప్రసాద్, శ్రీధర్ వ్యవహరించారు. అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- రిజర్వాయర్ ద్వారా నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు



( వరంగల్/ పర్వతగిరి ) జూలై 30, ప్రజాకలం ప్రతినిధి.

రైతులకు అన్ని విధాలుగా అండుకుంటూ అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు అన్నారు. గురువారం పర్వతగిరి మండల కేంద్రంలోని రిజర్వాయర్ వద్ద పూజలు నిర్వహించి రిజర్వాయర్ నుంచి కాలువలకు నీటిని విడుదల చేశారు. కాలువకు నీరు వస్తే రైతులకు వ్యవసాయానికి దోహదపడుతుందన్నారు. పర్వతగిరి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందుతుందని అన్నారు. ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ రైతుల బాధలు అర్థం చేసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేస్తున్నామన్నారు. స్థానికంగా కొంత మంది ప్రతిపక్ష నాయకులు రైతులకు తప్పుడోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రైతులకు సహాయం చేయలేని దద్దమ్మలు నోటికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సరైన రీతిలో బుద్ధి చెప్తామన్నారు. రైతులకు అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు నాయకులతో, అధికారులతో కలిసి సందర్శించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు సావిత్రి, సర్పంచ్ శంకర్, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ రావు, గ్రామ శాఖ అధ్యక్షులు రాంచందర్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేశ్వర్ రావు, ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు, సీనియర్ నాయకులు సంపత్, ఇరిగేషన్ అధికారులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తాడిచెట్టు పై నుండి పడి గీతా కార్మికుడికి తీవ్ర గాయాలు

- 108 లో ఎంజిఎం హాస్పిటల్ కు తరలింపు



( వరంగల్/ పర్వతగిరి) జూలై 30, ప్రజాకలం ప్రతినిధి పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన మేదరి రాజయ్య (55) సంవత్సరాలు తాడిచెట్టు పై నుండి కింద పడి తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు 108 కు సమాచారం అందించగా స్పందించిన నెక్కొండ 108 అంబులెన్సు సకాలంలో చేరుకొని గాయపడిన అతనికి ప్రథమ చికిత్స అందిస్తూ వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ కు తరలించినట్టు 108 ఈఎంటి ఉపేందర్, పైలట్ సుమన్ తెలిపారు. వెంటనే స్పందించి సకాలంలో చేరుకొని చికిత్స అందించిన 108 సిబ్బందిని గీత కార్మికుడి బంధువులు అభినందించారు.

# యాకయ్య కుటుంబానికి కాంగ్రెస్ అండ

### నిత్యావసర వస్తువుల పంపిణీ
### ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాలతో సహాయక చర్యలు
### ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని హామీ



(వరంగల్/వర్ధన్నపేట) జులై 30 ప్రజాకలం ప్రతినిధి: వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలోని 9వ డివిజన్‌కు చెందిన ఆర్లెల్లి యాకయ్య ఇటీవల అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి నిత్యావసర వస్తువులను అందజేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చుతూ, ప్రభుత్వం తరఫున అందాల్సిన అన్ని సంక్షేమ పథకాలు వారికి అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధత అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచనల మేరకు యాకయ్య కుటుంబానికి అవసరమైన ప్రభుత్వ సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మృతుని కుటుంబ పరిస్థితిని పరిశీలించిన అనంతరం, అర్హత మేరకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించేందుకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటారని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి అందేలా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు చేపడుతోందని నాయకులు పేర్కొన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలను పరామర్శించి వారికి భరోసా కల్పించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో 9వ డివిజన్ అధ్యక్షుడు చందు రవి, ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు తుళ్ల రవి, మాజీ కౌన్సిలర్ సమేట సుధీర్, నాయకులు కొండేటి సాంబయ్య, ఎర్ర శ్రీకాంత్, 10వ డివిజన్ అధ్యక్షుడు కొండేటి బాలకృష్ణ, జగన్, కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వసభ్య వాకౌట్‌తో గ్రామాల అభివృద్ధికి ఆటంకం

### -మండల సర్వసభ్య సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీ సర్పంచుల తీరుపై ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య విమర్శలు.

(వరంగల్ /వర్ధన్నపేట) జూలై 30 ప్రజాకలం ప్రజాప్రతినిధి: వర్ధన్నపేట నియోజకవర్గం, వర్ధన్నపేట మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి శ్రీపతి అధ్యక్షతన, ఎంపీడీఓ శ్రీమతి జి. వెంకట రమణ ఆధ్వర్యంలో మండల సర్వ సభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరైన వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ నరుకుడు వెంకటయ్య మాట్లాడుతూ, ఇది మొదటి సర్వసభ్య సమావేశం కావడంతో వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పై వివరాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం, వాటిపై సమగ్రంగా చర్చించడం సర్పంచుల బాధ్యత అని అన్నారు. అధికారులు వివరాలు చెప్పకముందే బీఆర్ఎస్, బీజేపీ సర్పంచులు సమావేశం నుంచి వాకౌట్ చేయడం సమంజసం కాదని విమర్శించా




రు. గ్రామాల అభివృద్ధిపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే అధికారుల వివరణ విని, అనంతరం సమస్యలను ప్రస్తావించాల్సి ఉండేదని పేర్కొన్నారు. రాజకీయ మనుగడ, పార్టీ నాయకుల మెప్పు కోసమే ఈ చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇల్లంద గ్రామంలో ఇళ్లు, ఇంటి అద్దెలను సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఏకపక్షంగా కూల్చివేయడం సరైన విధానం కాదని నరుకుడు వెంకటయ్య అన్నారు. గ్రామసభ లేదా వార్డు సభ్యుల సమావేశంలో తీర్మానం చేసి, బాధితులకు ముందస్తు నోటీసులు ఇచ్చిన తర్వాతే చర్యలు తీసుకోవాల్సి ఉండేదని సూచించారు. అలాంటి ప్రక్రియ పాటించకుండా బాధితులకు అన్యాయం జరిగిందని విమర్శించారు.సమావేశంలో ఇల్లంద సర్పంచ్ గతంలో మాజీ మంత్రి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ గ్రామాన్ని సందర్శించారని ప్రస్తావించారని, అయితే వారు అధికారంలో ఉన్న సమయంలో గ్రామానికి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పలేకపోయారని నరుకుడు వెంకటయ్య వ్యాఖ్యానించారు. ప్రస్తుతం వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఓర్వలేకనే కొందరు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాలు
# అప్రమత్తంగా ఉండాలి

### - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జూలై 30: రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తుండడం, అలాగే తక్కిన ప్రాంతాలలో భారీ వర్షాలు వచ్చేందుకు అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. గురువారం ఆయన హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో భారీ వర్షాల నేపథ్యంలో చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యేకించి అధికారులెవరు సెలవు పై వెళ్లవద్దని, అందరు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని అన్ని జిల్లాలలో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయాలని, ఇరిగేషన్ ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు ,రహదారులు అన్నిచోట్ల అప్రమత్తం చేయాలని, ఎక్కడైనా పడిపోయేందుకు అవకాశం ఉన్న గృహాలు, భవనాలను గుర్తించి అక్కడి వారిని భారీ చేయించి సురక్షిత ప్రాంతాలలో ఉంచేలా చూడాలని, వర్షాల వల్ల ప్రజలు పడకుండా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉండాలని ఓఆర్ఎస్ పాకెట్లు, పాము, తేలుకాటు వంటి వాటికి మందులను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. విద్యుత్తు, తాగునీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షాలలో ప్రజలకు సహకరించేందుకుగాను ఎస్ డి ఆర్ ఎఫ్, ఎన్ డి ఆర్ ఎఫ్ టీములను సిద్ధంగా ఉంచడం జరిగిందని ,భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో ఎలాంటి ప్రాణ నష్టం,ఆస్తి నష్టం సంభవించకుండా చూడాల్సిన అవసరం ఉందని, ఇందుకు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని అన్ని స్థాయిల అధికారులు కార్య స్థానాలు వదిలి వెళ్లొద్దని,ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు,తహశీల్దార్ లు, ఎం.పి.డి.ఓ లు,మున్సిపల్ కమిషనర్ లు పని చేస్తున్న హెడ్ క్వార్టర్ లో ఉండాలని ఎవరు సెలవు పై వెళ్లరాదని ఆదేశించారు. భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పని చేసేలా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కంట్రోల్ రూమ్ లో సమాచారం అందించేందుకు ఫోన్ నెంబర్ 08542 241165 ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భారీ వర్షాలకు సంబంధించిన సమాచారాన్ని, ఎటువంటి విపత్కర,ఎమర్జెన్సీ పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రజలు కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ కి తెలియజేయాలని కోరారు.రహదారులు,కల్వర్ట్ పై వర్షపు నీరు ప్రవహించి రాక పోకలకు ఇబ్బంది జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఓ,పోలీస్ అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్‌లు నుండి వరద నీరు ప్రవహించే చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో కోయిల్ సాగర్ సమీప ప్రాంతాలలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇరిగేషన్,రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో వర్షాల వలన ప్రజలకు ఇబ్బంది లేకుండా టామ్ టామ్,ప్రజలను అప్రమత్తం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పి.హెచ్.సి.లు, సి హెచ్.సి లలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు సేవలు అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.శిథిలావస్థ లో ఉన్న భవనాలు గుర్తించి ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. తాగునీరు, విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. జడ్.పి.సి.ఈ.ఓ.,ఇంచార్జి డి.పి.ఓ. వెంకట రెడ్డి, సిపిఓ కె.రవీందర్, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్,ఆర్‌డిఓ ఈ ఈ దేశ్య నాయక్,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ శ్రీనివాసులు,ఇరిగేషన్, వివిధ శాఖల అధికారులు ,తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

## మహిళలు కుటీర పరిశ్రమలు
# ఏర్పాటు చేసుకోవాలి

- తహసిల్దార్ వెంకటస్వామి
- వ్యాపారాల అభివృద్ధికి ఇంక్యుబేటర్ దోహదపడుతుంది.
- సెర్ప్, డిపిఎంలు దాస్, శంకర్ వరలక్ష్మి



(వరంగల్ /పర్వతగిరి) జూలై 30, ప్రజాకలం ప్రతినిధి మహిళలు మహిళా శక్తి పథకాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాలలో రాణిస్తూ, కుటీర పరిశ్రమల ఏర్పాటు చేసుకోవాలని పర్వతగిరి తహశీల్దార్ జి. వెంకటస్వామి సూచించారు. గురువారం మండలంలోని రైతు వేదికలో మదర్ తెరిసా మండల సమైక్య మహాసభ నిర్వహించారు. ఈ సమావేశానికి తహశీల్దార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సెర్ప్ డిఆర్డిఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు దాసు, శంకర్, వరలక్ష్మి మాట్లాడుతూ, మహిళలు వ్యాపార వాణిజ్య రంగాలలో అభివృద్ధి చెందుటకు ఇంక్యుబేటర్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. గ్రామీణ పేదలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి పరచుటకు వివోఏలు, వివో ప్రతినిధుల సమన్వయ సహకారంతో నిరంతరం కృషి చేయాలన్నారు. వివో అధ్యక్ష కార్యదర్శులు స్వప్న ఫరీదా బేగం లు వార్షిక ఆడిట్ నివేదికలను చదివి వినిపించారు. 2025–26 ఆర్థిక సంవత్సరం ఆదాయం సుమారు ?10 లక్షలు వచ్చినట్లు చెప్పారు. ముందుగా ఫామ్ డిపిఎం వరలక్ష్మి మండల కేంద్రంలో గుడ్లన్ ప్రాజెక్టు కింద నిర్మించిన దాల్మిల్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం తహశీల్దార్ వెంకటస్వామి తో పాటు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లు దాసు శంకర్, వరలక్ష్మి లను, ఐ.ఓ.బి సిండికేట్ బ్యాంక్ అధికారులతో పాటు పని ప్రగతిలో ప్రతిభ కనబరిచిన వివోఏలు, వివో ప్రతినిధులు స్వప్న, సుకన్య రాజేశ్వరి రాజయ్య, ఉమా, శిరీష లను మండల సమైక్య ప్రతినిధులు శాలువాలతో సన్మానించారు. ఈ సమావేశంలో స్త్రీ నిధి ఆర్ఎం సైదిరెడ్డి, ఏపిఎం రాజీరు, ఎమ్మెస్ ప్రతినిధులు స్వప్న, ఫరీదా, రజిత, సీసీలు కొమరయ్య, సుధాకర్, శ్యాంసన్, దేవేంద్ర ఎస్ఎస్ అసిస్టెంట్ మేనేజర్ లావణ్య, సీఈఓ శ్రీనివాస్, మండల సమైక్య సిబ్బంది రాధిక, అరుణ, వివిధ గ్రామాల వివో ప్రతినిధులు, వివోఏలు, పిఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ అభివృద్ధిని అడ్డుకుంటున్నది ప్రతిపక్షాలే

- -రూ.50 కోట్ల ప్రభుత్వ భూమిపై రూ.100 కోట్ల అవినీతి ఆరోపణలు నిరాధారం : రాయపురం సాంబయ్య
- -పారదర్శకంగా నిర్వహించిన వేలంపాటపై రాజకీయ రాద్ధాంతం సరికాదని వ్యాఖ్య
- -ప్రతిపక్షాల తీరుతో కొనుగోలుదారులు వెనుకంజ వేస్తున్నారని ఆవేదన

జులై 30 ప్రజా కలం ప్రతినిధి:( వరంగల్ /వర్ధన్నపేట) వరంగల్–హనుమకొండ–కాజీపేట నగరాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధుల సమీకరణ కోసం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వ భూములను పారదర్శకంగా వేలం వేసిందని, దీనిపై అవినీతి



ఆరోపణలు చేయడం ద్వారా ప్రతిపక్షాలు నగర అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని రాయపురం సాంబయ్య ఆరోపించారు. వరంగల్ నగర అభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనగాల వెంకటరాం రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూముల వేలంపాట నిర్వహించారని తెలిపారు. సుమారు రూ.50 కోట్ల విలువైన భూమిపై రూ.100 కోట్ల అవినీతి జరిగిందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని పేర్కొన్నారు. ఇప్పటికే టెండర్‌లో ఎంపికైన లబ్ధిదారులు ప్రభుత్వానికి పూర్తి మొత్తాన్ని చెల్లించలేదని, అలాంటి పరిస్థితుల్లో భారీ అవినీతి జరిగిందని ప్రచారం చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. ప్రతిపక్షాలు సృష్టిస్తున్న అనవసర వివాదాల కారణంగా కొనుగోలుదారులు కూడా వెనుకంజ వేస్తున్నారని, దీని వల్ల వరంగల్ నగర అభివృద్ధికి ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.గత పాలకులైన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు అనుసరించిన విధానాలనే ప్రస్తుతం కూడా ప్రతిపక్ష నాయకులు కొనసాగిస్తూ వరంగల్ అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి రాజకీయ ఆరోపణల వెనుక ఉన్న వాస్తవాలను ప్రజలు గుర్తించి అభివృద్ధికి సహకరించాలని రాయపురం సాంబయ్య కోరారు.

# మామునూర్ అభివృద్ధికి ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు హామీ

### గ్రామాభివృద్ధి పనులపై వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ నాయకులు అధికారులకు తక్షణ ఆదేశాలు

జూలై 29 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట) మామునూర్ గ్రామ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరుతూ వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజును మామునూర్ గ్రామ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గంట నరేందర్ రెడ్డి, గంట సత్యనారాయణ రెడ్డి, కంకాట్ల రవీందర్, ఈరుకొండ నాగేశ్వరరావు, సాంబారి రమేష్ తదితరులు గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు సానుకూలంగా స్పందిస్తూ, "నేను పుట్టి పెరిగిన మామునూర్ గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటాను. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని విధాలా కృషి చేస్తాను" అని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, సంబంధిత శాఖల అధికారులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తక్షణమే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.ఎమ్మెల్యే హామీపై గ్రామ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక చొరవ చూపుతున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



# బీజేపీ సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శిగా మార్కంటి ఏగొండ నియామకం

## రెండోసారి బాధ్యతలు.. రైతు సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తానన్న ఏగొండ

గజ్వేల్:30 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా రెండోసారి నియమితులైన మార్కంటి ఏగొండ పార్టీ రాష్ట్ర నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మార్కంటి ఏగొండ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి మరోసారి బాధ్యత లు అప్పగించిన మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు,బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వల్లపురెడ్డి రజినీకర్ రెడ్డి,గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్‌తో పాటు గజ్వేల్ నియోజకవర్గ నాయకులు, పార్టీ కార్యకర్తలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.తనకు రెండోసారి అప్పగించిన బాధ్యతను గౌరవంగా స్వీకరిస్తున్నానని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి రైతుల సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేస్తానని మార్కంటి ఏగొండ పేర్కొన్నారు. పార్టీ సంస్థాగత బలోపేతంతో పాటు రైతుల సమస్యల పరిష్కారం,ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన రైతులకు చేరవేయడంలో తన వంతు కృషిని పూర్తి స్థాయిలో అందిస్తానని తెలిపారు.నాపై విశ్వాసం ఉంచిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధి,రైతు సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని మార్కంటి ఏగొండ స్పష్టం చేశారు.



# మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన గోలి సంతోష్

గజ్వేల్:30 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

సిద్దిపేట జిల్లా ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షులు, గజ్వేల్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గోలి సంతోష్, గజ్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ వంటేరు



ప్రతాప్ రెడ్డితో కలిసి ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి,బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగానికి సంకేతంగా,రూరల్ సంస్కృతిని గుర్తుచేసేలా రూపొందించిన అందమైన "ఎడ్ల బండి మెమొంటో" ను కేసీఆర్ కి బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. రైతాంగాన్ని అన్ని వేళలా ఆదుకుంటూ,వారిని రాజును చేసే దిశగా నిరంతరం కృషి చేయాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, వ్యాపారులు, నాయకులు రైతాంగానికి తోడుగా నిలవాలని ఆయన సూచించారు. నియోజకవర్గ రైతాంగ సమస్యలు, వ్యవసాయ పరిస్థితులపై ఈ సందర్భంగా నాయకులు మాజీ ముఖ్యమంత్రికి వివరించారు. కెసిఆర్ చూపిన ఆప్యాయతకు, ఇచ్చిన మార్గదర్శకత్వానికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రీ-పోర్షన్డ్ ఆహారాలు పట్టణ గృహాలకు జీరో వేస్టేజ్ సాధించడంలో సహాయం

హైదరాబాద్, జూలై 30 (ప్రజా కలం ప్రతినిధి)

ఆహార వృథాను తగ్గించడంపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో, వంటగదులను సమర్థవంతంగా, వృథా లేకుండా నిర్వహించడంలో సురక్షితమైన ఆహార నిల్వ మరియు నిర్వహణ పద్ధతులు కీలకమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తేమ వాతావరణం కారణంగా తాజా కూరగాయలు, ప్రొటీన్లు త్వరగా చెడిపోతుంటాయి. USDA FSIS ప్రకారం, 4°C నుండి 60°C మధ్య ఉండే "డేంజర్ జోన్"లో సాల్మొనెల్లా, క్యాంపైలోబాక్టర్ వంటి బ్యాక్టీరియాలు కేవలం 20 నిమిషాల్లో రెట్టింపు అవుతాయి.




దీన్ని నివారించేందుకు, పట్టణ కుటుంబాలు ఇప్పుడు ఫ్రోజెన్ మరియు ఇండివిడ్యువల్లీ క్విక్ ఫ్రోజెన్ (IQF) ఆహారాల వైపు మొగ్గు చూపుతున్నాయి. వీటివల్ల అవసరమైనంత మేరకే వండుకోవచ్చు, అలాగే రుచి, పోషకవిలువలు, నాణ్యత ఎక్కువ కాలం నిలిచి ఉంటాయి. ఫార్మ్-టు-ఫోర్క్ విధానాన్ని అర్థం చేసుకోవడం, దీదీజు, IQF, HPP, FD వంటి లేబుళ్లను చదవడం నేర్చుకోవడం కూడా తాజాదనం, షెల్ఫ్ లైఫ్ గురించి వినియోగదారులు తెలివైన నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడుతుంది.

ఈ సందర్భంగా గోద్రెజ్ ఫుడ్స్ మార్కెటింగ్ & ఇన్నోవేషన్ హెడ్ అనుశ్రీ దేవెన్ మాట్లాడుతూ, తమ సంస్థకు ఆహార భద్రత కేవలం ఒక ప్రమాణం మాత్రమే కాదని, అది ఒక వాగ్దానమని అన్నారు. సోర్సింగ్ నుండి ప్యాకేజింగ్ వరకు ప్రతి దశలోనూ భద్రతా విధానాలను పొందుపరుస్తున్నామని తెలిపారు. పరిశుభ్రత లేదా పోషకవిలువలతో రాజీ పడకుండా సౌలభ్యాన్ని కోరుకునే వినియోగదారులు ఎక్కువగా ఫ్రోజెన్ ఆహారాల వైపు మొగ్గు చూపుతున్నారని ఆమె పేర్కొన్నారు. వృథాను తగ్గించి, ఆరోగ్యకరమైన భోజనాన్ని అందించే ఉత్పత్తుల ద్వారా పట్టణ గృహాల్లో సురక్షితమైన, తెలివైన వంటగది అలవాట్లను ప్రోత్సహిస్తున్నామని ఆమె తెలిపారు.

# ఇంజనీరింగ్ విద్యార్థులపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు గర్హనీయం

## విద్యార్థుల జోలికొస్తే ధర్మేంద్ర ప్రధాన్ కు పట్టిన గతే రేవంత్ రెడ్డికి పడుతుంది.

## గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్.....



గజ్వేల్:30 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

టీచర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇంజనీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు.ప్రపంచంతో పోటీపడి ఎంతో శ్రమకోర్చి చదువుతూ తమ ప్రతిభతో ప్రపంచ వ్యాప్తంగా అనేక మల్టీ నేషనల్ కంపెనీల్లో పనిచేస్తున్న తెలంగాణ ఇంజనీరింగ్ విద్యార్థుల నైపుణ్యం రేవంత్ రెడ్డికి కనిపించడం లేదన్నారు.

ఇవ్వాళ తెలంగాణ ఆర్థిక ప్రగతిలో సింహభాగాన్ని సమకూర్చింది ఐటీ పరిశ్రమాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులే అనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.ముఖ్యమంత్రి మాట తీరుతో తెలంగాణ పరువంతా పోతుందని దివ్యమైన ఆర్థిక ప్రగతితో ఉన్న రాష్ట్రాన్ని దివాలా తీసిందని అప్పు పుట్టే పరిస్థితి లేదని మాట్లాడి రాష్ట్ర భవిష్యత్తును దెబ్బతీసారని అదేవిధంగా ఇవ్వాళ ప్రపంచవ్యాప్తంగా ఎంతో నైపుణ్యం ఉన్న తెలంగాణ ఇంజనీరింగ్ విద్యార్థుల మీద చిల్లర కామెంట్లు చేసి లక్షలాది మంది ఇంజనీరింగ్ విద్యార్థుల మనోభావాలను రేవంత్ రెడ్డి దెబ్బ తీశారన్నారు.తెలంగాణలో విద్యార్థులు అనేక రకాల ప్రతికూల పరిస్థితులను ఎదుర్కుంటూ తమ విశేషమైన ప్రతిభతో రానిస్తున్నారని అట్లాంటి వారికి ఏమీ రాదని ఒక ముఖ్యమంత్రి ఎద్దేవా చేసేలా మాట్లాడడం ఆయన మూర్ఖత్వానికి నిదర్శనం అన్నారు.

ఇక్కడ పనిచేస్తున్న టీచర్లను స్టడీ టూర్ల పేరు మీద విదేశాలకు పంపినంత మాత్రాన విద్యావ్యవస్థ మారదని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేసి అవసరమైన నిధులు కేటాయించి శ్రద్ధవహిస్తేనే ఫలితాలు వస్తాయని అన్నారు.

రేవంత్ రెడ్డి కి చదువు మీద సరైన అవగాహన లేకపోవడం వల్లే ఒకరోజు జర్మన్, జపాన్ భాషలు నేర్వాలని మరోరోజు ఇలా విద్యార్థులను క్రిమినల్ వేస్ట్ అని మాట్లాడుతున్నాడని అన్నారు.విద్య ఎన్నటికీ జ్ఞానాన్ని మాత్రమే ఇస్తుందని విద్యార్థులు క్రిమినల్ వేస్ట్ కాదని విద్యా మంత్రిగా, ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిసస్తూ వేల కోట్ల రూపాయలు ఫీజ్ రియాంబర్స్ మెంట్ ఇవ్వకుండా ఎగ్గొడుతున్న రేవంత్ రెడ్డిదే క్రిమినల్ నెగ్లిజెన్సీ అని అన్నారు.విద్యార్థుల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడింది, మొన్న కేంద్ర ప్రభుత్వాన్ని వణికించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేదాకా పట్టువిడవకుండా పోరాడింది విద్యార్థులే అన్న విషయం మరిచిపోవద్దని వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహారించుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఢిల్లీలో ధర్మేంద్ర ప్రధాన్ కు పట్టిన గతే రేవంత్ రెడ్డికి పడుతుందని హెచ్చరించారు.



# ముషీరాబాద్ నియోజకవర్గం లో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేయాలి

## ముషీరాబాద్ తెలంగాణ ఉద్యమకారులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు

ముషీరాబాద్,జూలై30,(ప్రజా కలం ప్రతినిధి)

ఇందిరమ్మ ఇల్లు పథకంలో ముషీరాబాద్ నియోజకవర్గానికి ముందు చేయి చూపారని నియోజకవర్గానికి ఇంద్ర మహిళ పథకంలో తీవ్ర అన్యాయం జరిగిందని ముషీరాబాద్ తెలంగాణ ఉద్యమ కారులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తెలిపారు. గురువారం రాంనగర్ లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేయాలని, ఈ పథకం ముషీరాబాద్ నియోజకవర్గంలో అమలు కావడం లేదని ఎందుకు ముందు చేయి చూపారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలందరికీ ఉచిత ఇల్లు అందిస్తామని నమ్మించి మోసం చేసి ఆరు లక్షల కడితేనే ఇల్లు 10వేల రూపాయలు దరఖాస్తు రుసుము పెట్టి ప్రజలకు అందని దక్షయల చేస్తుందని విమర్శించారు.

కాంగ్రెస్ బడా నేతల ఆడంబరాలకు తప్ప అభివృద్ధికి పనికిరాని పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిందని కేసీఆర్ ప్రభుత్వంలో ముషీరాబాద్ నియోజకవర్గానికి 360 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పేద ప్రజలకు ఉచితంగా ఇచ్చిన ఘనత ఉందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో రేషశీ మల్లేష్,కల్వ గోపి,నేత శ్రీనివాస్,అజయ్ ముదిరాజ్,చిట్టి శ్యాంసుందర్,సిరిగిరి శ్యామ్,పున్న సత్యనారాయణ,బండా యుగేందర్,కొండ మాధవ్,వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# దోస్త్ ద్వారా చేరిన విద్యార్థులకు ప్రభుత్వ హాస్టల్ సౌకర్యం: కలెక్టర్ కె. హైమావతి

## గజ్వేల్, సిద్దిపేటలో హాస్టళ్లను పరిశీలించిన కలెక్టర్..

## అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు

గజ్వేల్: 30 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

దోస్త్ ఆన్‌లైన్ ద్వారా గజ్వేల్, సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో వివిధ ప్రాంతాల నుంచి అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యను కొనసాగించేందుకు ప్రభుత్వం తరఫున హాస్టల్ సౌకర్యం కల్పిస్తామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు.గురువారం గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల కోసం ఏర్పాటు చేయనున్న ఎడ్యుకేషన్ హబ్ హాస్టల్,అలాగే సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల కోసం సఖి కేంద్రం వెనుకనున్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రం నలుమూలల నుంచి దోస్త్ ద్వారా గజ్వేల్,సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులు అడ్మిషన్ పొందారని,ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రైవేట్ వసతి తీసుకునే పరిస్థితి లేక కళాశాలలు మార్చుకునే పరిస్థితి రాకుండా ప్రభుత్వం హాస్టల్ సౌకర్యం కల్పిస్తోందన్నారు.ఏ ఒక్క విద్యార్థి కూడా వసతి సమస్య కారణంగా చదువును మధ్యలో వదిలేయకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల కోసం ఎడ్యుకేషన్ హబ్ వెనుక ఖాళీగా ఉన్న భవనాలను హాస్టల్‌గా సిద్ధం చేయాలని, అలాగే ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్‌లో కొన్ని



గదులను కేటాయించి బెడ్లు, వాష్‌రూమ్‌లు,కిచెన్ తదితర సౌకర్యాలు కల్పించాలని ఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సిద్దిపేట మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల కోసం వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను కేటాయిస్తున్నామని, అక్కడ అవసరమైన మైనర్ మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం కలెక్టర్ సఖి కేంద్రాన్ని సందర్శించి అక్కడి సౌకర్యాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత, ఈడబ్ల్యూఐడీసీ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ అధికారి శారద,పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎడతెరిపి వర్షాలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

## తొగుట సీఐ లతీఫ్.

దుబ్బాక ప్రజాకలం జూలై 30.

వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలని తొగుట సీఐ షేక్ లతీఫ్ సూచించారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరద నీరు ప్రవహిస్తున్న రోడ్లు, వాగులను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. ఆలస్యమైనా పర్వాలేదని, ప్రాణ భద్రతే ముఖ్యమని పేర్కొన్నారు. వర్షం సమయంలో పాత చెట్లు, ప్రమాదకర ప్రాంతాల వద్ద ఆశ్రయం పొందవద్దని, తడి రోడ్లపై వాహనాలను అధిక వేగంతో నడపకుండా నెమ్మదిగా, అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు. నీటి గుంతలు లోతుగా ఉండే అవకాశం ఉన్నందున ముందుగా పరిస్థితిని పరిశీలించిన తర్వాతే ప్రయాణం కొనసాగించాలని తెలిపారు. విద్యుత్ స్తంభాలు లేదా తెగిపోయిన విద్యుత్ తీగల సమీపంలో నీరు నిల్వ ఉంటే వాటికి దూరంగా ఉండి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. భారత వాతావరణ శాఖ, ట్రాఫిక్ పోలీసులు జారీ చేసే హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని, అత్యవసరం అయితే తప్ప వర్షాల సమయంలో అనవసర ప్రయాణాలు చేయవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా వాట్సాప్ హెల్ప్‌లైన్ 8712667100కు సంప్రదించి పోలీసుల సహాయాన్ని పొందాలని తొగుట సీఐ షేక్ లతీఫ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# మహంకాళి బోనాల ఉత్సవాలకు సర్పంచులను ఆహ్వానించిన మాజీ ఉపసర్పంచ్ జె రవి నాయక్

మహేశ్వరం, జూలై 30, (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం మంఖల్ జిహెచ్ఎంసి 67వ డివిజన్లో



ఆగస్టు రెండున ఆదివారం నాడు జరగబోయే మహంకాళి బోనాల ఉత్సవాలకి మాజీ ఉపసర్పంచ్ జె రవి నాయక్ కి, పెద్దమ్మ తాండ సర్పంచ్ లచ్య నాయక్ గారికి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు యాదయ్య గౌడ్ కి ముఖ్య అతిధిగా రావాలని ఆహ్వానించిన గుడి సభ్యులు అనంతరం జే.రవి నాయక్ 11,000-వేల,యాదయ్య గౌడ్ 2500-రూపాయలు గుడి మెంటనెస్ కు విరాళంగా గుడి సభ్యులకు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమలో మాజీ వార్డు మెంబర్ రవి నాయక్,బి ఆర్ ఎస్ సీనియర్ లీడర్ వర్త్య సురేష్ నాయక్, లక్ష్మణ్ నాయక్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# సమీక్ష సమయం..

## సంతకం లేని ఫారాలను డిజిటలైజ్ చేయవద్దు-డిఈఓ ఆర్.వి.కర్ణన్ ఆదేశం

## డిజిటలై జేషన్ పై ఆరా...ఈఆర్ఓఎస్ కు దిశా నిర్దేశం..

## ఎస్ఐఆర్ పై సమీక్ష, పాల్గొన్న 15 మంది ఈఆర్ఓఎస్

హైదరాబాద్, జూలై 30 (ప్రజా కలం ప్రతినిధి)

హైదరాబాద్ జిల్లా పరిధిలో సాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతిపై జిల్లా ఎన్నికల అధికారి , జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 15 మంది ఎన్నికల నమోదు, సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా.. వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రికార్డుల ప్రామాణికత, విశ్వసనీయతను కాపాడేందుకు ఓటరు సంతకం తప్పని సరి అన్ని వెల్లడించారు. సంతకం లేని ఏ ఎన్యూమరేషన్ ఫారాన్నీ డిజిటలైజ్ చేయవద్దని డీఈఓ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్క ఓటరూ జాబితా నుంచి తొలగిపోకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమాజంలోని అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. అలాగే, 1,100 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా గుర్తించి వాటిని హేతు బద్ధీకరించాలని ఆదేశించారు. ఇలా చేయడంతో ఓటింగ్ సమయంలో ఎదురయ్యే రద్దీని నివారించవచ్చని స్పష్టం చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ఓటర్లకు అవసరమైన తాగునీరు, నీడ, ర్యాంప్‌లు వంటి కనీస ప్రాథమిక సౌకర్యాలు ఖచ్చితంగా అందుబాటులో ఉండేలా సరిచూసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో అదనపు కమిషనర్ బి. సంతోష్ , సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈఓ అరవింద్ కుమార్ ద్వివేది, శంషాబాద్ జోనల్ కమిషనర్ కె. చంద్రకళ, హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్ఓలు పాల్గొన్నారు.





## కల్వకోల్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

### కల్వకోల్ గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ

మహేశ్వరం, జూలై 30,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామంలో మెడికవర్ హాస్పటల్ నుంచి ఉచిత వైద్యం (స్త్రీరోగ నిపుణురాలు) డాక్టర్ లావణ్య డా.రాజా.(హృద్రోగ నిపుణుడు) వగ్గాని శ్రీనివాస్ (సీనియర్ మార్కెటింగ్ అసోసియేట్) ప్రవళిక (ఏకో టెక్నీషియన్) సుమయ్య,లలిత,నీరజా ఈ డాక్టర్ చేత ఈరోజు ఉచితంగా 100 మందికి ఉచితంగా వైద్యం కల్పించడం జరిగిందని గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పులిమామిడి జనార్ధన్ గౌడ్, విలేజ్ సెక్రటరీ వేణు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## భారతి నగర్‌పై కమిషనర్ ఫోకస్..

### -భారతి నగర్‌లో కమిషనర్ పర్యటన..
### పెండింగ్ పనులపై ఫోకస్..

పటాన్‌చెరు, జులై 30 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్ చేరు భారతి నగర్ డివిజన్‌లో పెండింగ్ అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలను పరిశీలించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన,



మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డితో కలిసి విస్తృతంగా పర్యటించారు. బీడీఎల్ కాలనీ వద్ద నిర్మించాల్సిన రక్షణ గోడ, రాయసముద్రం చెరువు సమీపంలోని వర్షపు నీటి కాలువను పరిశీలించిన కమిషనర్ దృష్టికి అసాంఘిక కార్యకలాపాల నేపథ్యంలో ప్రజల భద్రత కోసం వెంటనే రక్షణ గోడ నిర్మించాలని సింధు ఆదర్శ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అనంతరం వార్డు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంఎంటీఎస్ నిలయం నుంచి విద్యుత్ నగర్ వరకు తారు రహదారి,చెత్త సేకరణకు శాశ్వత పరిష్కారం, అమీన్‌పూర్ సర్కిల్‌కు చెట్ల కొమ్మల కత్తిరింపు వాహనం, పాత ఎంఐజీ కాలనీ క్రీడా మైదానం దస్త్రం పరిష్కారం, పెండింగ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని వినతిపత్రం అందజేశారు. కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజల సమస్యలు విన్న కమిషనర్ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు..

## ఎస్ఐఆర్‌కు నాలుగు రోజులే..

### -ఎస్ఐఆర్‌కు మరో 4 రోజులే..
### ప్రతి ఓటరు నమోదు తప్పనిసరి!..

పటాన్‌చెరు,జులై 30 (ప్రజా కలం) ప్రతినిధి

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ముగియడానికి మరో నాలుగు రోజులే మిగిలి ఉన్నందున అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.పటాన్‌చెరు జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ముస్లింలు,



క్రైస్తవులు,బియ్యం మిల్లుల యజమానులు,సెంటరింగ్ సంఘం సభ్యులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు.గత 40 రోజులుగా ఎస్ఐఆర్‌పై విస్తృత ప్రచారం చేపడుతున్నామని, జులై 30 ఉదయం 10 గంటల నాటికి నియోజకవర్గంలో 63.27 శాతం నమోదు మాత్రమే పూర్తైందని తెలిపారు.బూత్ స్థాయి అధికారులకు దరఖాస్తులు ఇచ్చిన ప్రతి ఓటరు వాటిని వెంటనే పూర్తి చేసి సమర్పించాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఓటు కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదర్శ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, వివిధ మత, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు..



# స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా తమాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలి

### జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య
### సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు

రాజేంద్రనగర్, జూలై 30,(ప్రజా కలం)

స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా తమాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు అన్నారు.బీసీ హక్కుల సాధన సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గ సమావేశం ఈరోజు రాజేంద్రనగర్ మండల కార్యాలయం ఏ ఆర్ దేవరాజ్ భవన్ లో జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సిపిఐ మాజీ కార్యదర్శి సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు హాజరయ్యారు. ఈ సమావేశం బీసీ హక్కుల సాధన సమితి రాజేంద్రనగర్ మండల ఇంచార్జ్ జే ఆనంద్ గౌడ్ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశ ఉద్దేశించి బీసీ హక్కుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య,సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్ రావు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో




బీసీలకు జనాభా తమాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలి అని మరియు వార్షిక బడ్జెట్లో ప్రతి వార్షిక సంవత్సరము 50% బడ్జెట్ బీసీలకు కేటాయించాలని వారు అన్నారు చట్టసభలో పార్లమెంట్ అసెంబ్లీలలో బీసీలకు జనాభా తమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి మరియు ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి అని ఐదు శాతం జనాభా లేని వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పించడం వలన బీసీలకు అత్యధికంగా నష్టపోతున్నారు కావున ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్లను పునర్ పరిశీలించాలి అని వాళ్లు అన్నారు టి జి పి ఎస్ సి 29 జీవోను రద్దు చేయాలి మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు 50% సబ్ కోట కేటాయించాలి అని వారు అన్నారు మరియు రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో నూతన కమిటీలను ఎన్నుకోవడం జరిగింది.

రాజేంద్రనగర్ మండలం బీసీ హక్కుల సాధన సమితి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది గౌరవ అధ్యక్షులుగా జే ఆనంద్ గౌడ్ అధ్యక్షులు జె సదానంద గౌడ్ ఉపాధ్యక్షులు గుజ్జరీ శ్రీరాములు ప్రధాన కార్యదర్శి కె మనోజ్ సహాయ కార్యదర్శిగా కె మౌనిక తో పాటు15 మందితో కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

బీసీ హక్కుల సాధన సమితి గండిపేట్ మండల అధ్యక్షులుగా ఆర్ శ్రీనివాస్ ని ప్రధాన కార్యదర్శిగా ఎం గోపాల్ తో పాటు 11 మందితో కమిటీ ఎన్నుకోవడం జరిగింది. బీసీ హక్కుల సాధన సమితి శంషాబాద్ మండల అధ్యక్షులుగా డి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శిగా కావలి మల్లేష్ తో పాటు 11 మందితో కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ శంషాబాద్ కార్యదర్శి నరగిరి గండిపేట కార్యదర్శి మల్లేష్ రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి జె విజయ్ ఆనంద్ గౌడ్ భారత జాతీయ మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాజేంద్రనగర్ మండల ప్రధాన కార్యదర్శి కన్యగారి లక్ష్మి రాజేంద్రనగర్ మండల అధ్యక్షురాలు మునేశ్వరి కార్యాలయం కార్యదర్శి జి సత్యం గంగారం శాలిని జ్యోతి మధు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో రాజీవ్ పార్క్‌ను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి.

### -నలుగురు ముఖ్యమంత్రుల సహకారం తో సంగారెడ్డి రాజీవ్ పార్క్ అభివృద్ధి
### ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంజూరు చేస్తే, సీఎం రోశయ్య శంకుస్థాపన చేశారు.
### కిరణ్ కుమార్ రెడ్డి ప్రారంబించారు.
### మరో 6 కోట్ల తో మరలా సుందరీకరణ తర్వాత త్వరలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు.



సంగారెడ్డి ప్రతినిధి జులై 30( ప్రజా కలం):

సంగారెడ్డి రాజీవ్ పార్క్ ఏర్పాటు, అభివృద్ధి లో నలుగురు ముఖ్యమంత్రుల సహకారం ఉందని జగ్గారెడ్డి అన్నారు. గురువారం ఆయన రాజీవ్ పార్క్ ను సందర్శించి , పార్క్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. పార్క్ మొత్తం కలియ తిరుగుతూ జరుగుతున్న, జరగాల్సిన అభివృద్ధి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పార్క్ లో నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలను స్వయంగా పరిశీలించారు. ఫౌంటెన్ పునరుద్ధన పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి రాజీవ్ పార్క్ కు అనుమతులు మంజూరు చేశారన్నారు. అనంతరం సీఎం రోశయ్య శంకుస్థాపన చేయగా, సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ప్రారంభించారన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ కాలంలో రాజీవ్ పార్క్ పూర్తిగా చెడిపోయి నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుందని అన్నారు. తిరిగి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం తో, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ టీ కే శ్రీదేవి సహకారం తో మరో రూ. 3 కోట్ల నిధుల తో రాజీవ్ పార్క్ ను మొదటి దశగా అభివృద్ధి చేశామని, మరో రూ. 6 కోట్ల రూపాయల నిధుల తో అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో రాజీవ్ పార్క్ ను తిరిగి ప్రారంభిస్తమని వివరించారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిశన్ నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హాఫీజ్, టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, శ్రీహరి, కౌన్సిలర్ లు మహేష్, నవాజ్ , మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ముత్తంగి అంగన్‌వాడీకి మంత్రి సీతక్క హామీ!

### -భవన నిర్మాణంపై శాపురం నరసింహారెడ్డి వినతి..
### అభివృద్ధి అంశాలపై చర్చ..

పటాన్‌చెరు, జులై 30 (ప్రజా కలం) ప్రతినిధి

ముత్తంగి డివిజన్‌లో అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి తక్షణ చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శాపురం నరసింహారెడ్డి రాష్ట్ర మంత్రి దనసరి సీతక్కను కోరారు.



హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన ఆయన, ముత్తంగి డివిజన్‌కు సంబంధించిన పలు అభివృద్ధి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.అంగన్‌వాడీ భవనం నిర్మాణం పూర్తయితే చిన్నారులు,గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని శాపురం నరసింహారెడ్డి వివరించారు.అలాగే ముత్తంగి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి దనసరి సీతక్క సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, డివిజన్ అభివృద్ధే తమ లక్ష్యమని శాపురం నరసింహారెడ్డి పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాంప్రసాద్‌తో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు
### జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

రంగారెడ్డి జిల్లా, జూలై 30,(ప్రజా కలం)

రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, భారత వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు తక్షణ సహాయ సేవలు అందించేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసే ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలోని రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, వాగులు, వంకలు, చెరువుల పరిసరాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ( ప్ జ ల ం అత్యవసర పరిస్థితులు మినహా అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, నీటితో నిండిన రహదారులను దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. విద్యుత్ తీగలు తెగిపడిన ప్రాంతాలకు దూరంగా ఉండాలని, చెట్లు కూలిపోయే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని, చిన్నారులు, వృద్ధుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వర్షాల కారణంగా ఎక్కడైనా ముంపు, రవాణా అంతరాయం లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు



చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని తెలిపారు. అందిన ప్రతి సమాచారంపై సంబంధిత శాఖలు తక్షణమే స్పందించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అన్ని మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తమ పరిధిలోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు అధికారుల సూచనలు, వాతావరణ శాఖ హెచ్చరికలను తప్పనిసరిగా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

జిల్లా కంట్రోల్ రూమ్ కు 040-23237416, 9704958473 సంప్రదించాలని కోరారు.

## ఆషాడ మాస బోనాల మహోత్సవాలకు సబితా ఇంద్రా రెడ్డి కి ఆహ్వానం పలికిన కాటేదాన్ డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్. వెంకటేష్

రాజేంద్రనగర్, జూలై 30,(ప్రజా కలం)

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధి ఉమ్మడి మైలార్దేవపల్లి డివిజన్ లో ఆగస్టు 2వ తేదీ ఆదివారం రోజున జరగనున్న ఆషాడ మాస బోనాలకు కాటేదాన్ డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ గారితో పాటు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనగర్ కాలనీ లో మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు పి. సబితా ఇంద్రారెడ్డి ని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ని వారి నివాసములో మర్యాదపూర్వకంగా కలిసి, రానున్న అమ్మవారి బోనాల మహోత్సవాలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. సబితా ఇంద్రా రెడ్డి, కార్తీక్ రెడ్డి ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరిస్తూ, బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన గొప్ప ఆధ్యాత్మిక ఉత్సవమని అన్నారు.అమ్మవారి కృపాకటాక్షాలతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాలతో విలసిల్లాలని ఆకాంక్షిస్తూ, అమ్మవారి బోనాల మహోత్సవాలు తప్పకుండా ఇరువురు హాజరవుతామని, విజయవంతం కావాలని కోరుకున్నారు. ?ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆక్యం రాఘవేంద్ర యాదవ్ మైసిరెడ్డి క్రాంతి మహేందర్ శాంతిరాజ్ అఖిల్ నిఖిల్ నితిన్ చిరు పవన్ అనిల్ చిన్న కున్సి సోను తో పాటు యువకులు పాల్గొన్నారు.





## మహేశ్వరం నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

మహేశ్వరం, జూలై 31,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని జీహెచ్ఎంసీ బాలాపూర్ డివిజన్ మల్లాపూర్ మరియు బడంగ్ పేట్ డివిజన్ ఇందిరానగర్ ప్రాంతాలలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, బాలాపూర్ డివిజన్ పరిశీలకులు సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, పార్టీ నాయకులు మరియు యువకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ... ఆగస్టు 3వ తేదీతో ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు ముగియనున్నందున, ఇంకా ఎవరైనా ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి ఇవ్వనివారు లేదా నమోదు చేసుకోనివారు వెంటనే అప్రమత్తం కావాలి అని, అర్హులైన ప్రతి ఒక్కరూ వెంటనే సంబంధిత బీఎల్ఏ లేదా బీఎల్ఓ లను సంప్రదించి జాగ్రత్తపడాలని కోరారు. ఓటు అనేది ప్రజాస్వామ్యంలో అత్యంత బలమైన ఆయుధమని, దానిని కోల్పోతే మన హక్కును మనమే నిర్లక్ష్యం చేసినట్లు అవుతుందని ఆమె స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ఎన్యుమరేషన్ ఫారంలో తప్పకుండా నమోదు చేసుకోవాలని, బీఎల్ఓలకు వాటిని అందజేసి ఆన్‌లైన్ కూడా చేయించుకోవాలని పిలుపునిచ్చారు.

## రాజేంద్రనగర్‌లో గణేష్ ఉత్సవాలు, నిమజ్జనంపై సమీక్షా సమావేశం

### రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
### రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

రాజేంద్రనగర్, జూలై 30, (ప్రజా కలం)

రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో, రాజేంద్రనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు టి ప్రకాష్ గౌడ్ అధ్యక్షతన హైదరాబాద్



గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధుల సమక్షంలో గురువారం గణేష్ ఉత్సవాలు నిమజ్జన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటు నుండి విగ్రహాల నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ (మున్సిపల్), పోలీస్, విద్యుత్ శాఖలతో పాటు ఇతర సంబంధిత శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ నాయకులు సమన్వయంతో పనిచేస్తూ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు.?ఈ సమావేశంలో రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని వివిధ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, లా అండ్ ఆర్డర్ డిసిపి శ్రీనివాస్ , ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే , వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆలిండియా ఓబీసీ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ చేసిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ముకురాల చంద్రశేఖర్ గౌడ్

మహేశ్వరం, జూలై 30,(ప్రజా కలం)

మైసగండి మైసమ్మ అమ్మవారి ప్రాంగణంలో జరిగిన ఆలిండియా ఓబీసీ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ముకురాల చంద్రశేఖర్ గౌడ్, ఉపాధ్యక్షులు రాసూరి జ్ఞానేశ్వర్ హాజరు అవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రంగారెడ్డి జిల్లా బిసి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రాజమోని మహేశ్వర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు ఎడ్ల వెంకటేష్ ముదిరాజు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలోని వివిధ శాఖలోని బీసీ ఉద్యోగులు అధిక సంఖ్యలో ఆగస్టు 7 తారీకు బెంగళూరులో జరగబోయే ఓబీసీ మహాసభలను విజయవంతం చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఈ జిల్లా కార్యవర్గ సభ్యులు మహేష్ ముదిరాజ్, రమేష్ ముదిరాజ్, గణేష్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# సంగారెడ్డి మెడికల్ కళాశాలలో అవినీతి అక్రమాలు.

- -అవినీతికి పాల్పడుతున్న ఏజెన్సీలు రద్దు చేయాలి.
- -ఏజెన్సీలకు సహకరించిన ప్రభుత్వ ఉద్యోగులను సస్పెండ్ చేయాలి
- -నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాలు ఎలా భర్తీ చేస్తారు
- -మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం,యాదగిరి ప్రభుత్వానికి డిమాండ్





సంగారెడ్డి ప్రతినిధి జులై 30( ప్రజా కలం):

కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కింద నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాలు ఎలా భర్తీ చేశారు అవినీతికి పాల్పడుతున్న ఏజెన్సీలను రద్దు చేసి ప్రభుత్వం ద్వారా ఉద్యోగాలు నోటిఫికేషన్ వెయ్యాలని ఏజెన్సీలకు సహకరించిన ప్రభుత్వ ఉద్యోగులను సస్పెండ్ చేయాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం యాదగిరి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు . సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మెడికల్ కళాశాల ముందు ధర్నా నిర్వహించి అనంతరం మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం, యాదగిరి మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్పిటల్ మెడికల్ కళాశాలలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఏజెన్సీలకు వత్తాసు పలుకుతూ వారికి అనుకూలంగా ఉన్నవారికే ఉద్యోగాలివ్వడం చాలా దారుణమన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ మెడికల్ కళాశాలలో ఉద్యోగాలు రావాలంటేనే ఏజెన్సీలు,అధికారులకు చేతులు తడిస్తే తప్ప ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు అందులో పని చేస్తున్న కార్మికులను కాదని అధికారులు ఏజెన్సీలకు వత్తాస్తు పలుకుతూ వాళ్లకి అనుకూలంగా ఉన్నవారికి డబ్బులు ఇస్తేనే ఉద్యోగం ఇస్తున్నారని ఆయన అన్నారు మార్పు అంటే ఇదేనేమో అని అన్నారు ఆస్పత్రిలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న కార్మికులను కాదని ఇతరులకు ఔట్సోర్సింగ్ కింద ఉద్యోగాలివ్వడం అన్యాయమని దుయ్యబట్టారు . ఔట్సోర్సింగ్ కింద ఉద్యోగాలు పేరుమీద నోటిఫికేషన్ వేయకుండా ఎలా రిక్రూట్మెంట్ చేస్తారని అన్నారు అధికారులు ఎవరికి చెప్పకుండా కాంట్రాక్టర్లకు వత్తాస్తు పలుకుతూ వారికి అనుకూలంగా ఉన్న వారికి ఉద్యోగాలు ఇవ్వడం ఏంటని అన్నారు కార్మికులకు మేలు చేయాల్సిన అధికారులే ఇలా చేయడం ఏంటని అన్నారు నోటిఫికేషన్ వేయకుండా ఉద్యోగాలు తీసుకున్న వారిని రాతొలగించి వారి స్థానంలో అందులో పని చేస్తున్న కాంటాక్ట్ కార్మికులను తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు లేనిపక్షంలో కార్మికులందరూ ఐక్యం చేసి పోరాటం నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వానికి హెచ్చరించారు ఇప్పటికైనా ప్రభుత్వ హాస్పిటల్,మెడికల్ కళాశాల అధికారులు పద్ధతి మార్చుకోవాలని ఆయన అన్న లేనిపక్షంలో భవిష్యత్తులో ఏమన్నా జరుగుతే దీనికి బాధ్యత ప్రభుత్వ హాస్పిటల్, మెడికల్ కళాశాల అధికారులు వహించాల్సి వస్తుందని అన్నారు . ప్రభుత్వం స్పందించి వెంటనే నియామ కాల్లో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని లేదా పోరాటం మరింత తీవ్రతం చేస్తామని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కే,యాదగిరి కే, సదానంద శోభ సునీత లక్ష్మీ ప్రియ మొగులమ్మ భాగ్యలక్ష్మి శేఖర్ నాగరాజు, మహేందర్ రెడ్డి సురేష్ మల్లేశం మహేందర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు

# వేములవాడకు అభివృద్ధి--ఆధ్యాత్మికత కొత్త శోభ

- - తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణకు శంకుస్థాపన.
- -భీమేశ్వర ఆలయంలో వరుణయాగానికి శ్రీకారం.
- - రూ.12 కోట్లతో గుడి చెరువు బండ్ పార్క్‌ప్రారంభం.
- -రాజన్న ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా
- - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.





**వేములవాడ, జూలై 30 ( ప్రజా కలం ప్రతినిధి) :**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో గురువారం అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వరుణయాగాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్‌స్టేషన్ ఆధునీకరణకు శ్రీకారం...

వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్‌ను రూ.1.62 కోట్లతో ఆధునీకరించేందుకు మంత్రులు శంకుస్థాపన చేశారు. అనంతరం వేములవాడ--కోరుట్ల మీదుగా బాసరకు నూతన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని తెలిపారు. మహిళల ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ ప్రయాణికుల సంఖ్య పెరగడంతో కొత్త బస్సుల కొనుగోలు, సిబ్బంది నియామకాలు చేపట్టామని చెప్పారు. 1984లో నిర్మించిన తిప్పాపూర్ బస్‌స్టేషన్‌ను ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతున్నా మని తెలిపారు. దక్షిణ కాశిగా పేరొందిన వేములవాడకు ప్రతిరోజూ సుమారు 250 బస్సులు, 560 ట్రిప్పులు నడుస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయ ప్రాంతాల్లో మౌలిక వసతులతో పాటు బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఆర్టీసీ మహిళలకు ఉచిత ప్రయాణాన్ని విజయవంతంగా అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకొని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. తదనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు రూ.240 కోట్లకు పైగా వ్యయంతో కొనసాగుతున్నాయని తెలిపారు. అదే అభివృద్ధి దిశగా బస్‌స్టేషన్ ఆధునీకరణ



కూడా చేపట్టడం సంతోషకరమన్నారు.

రాజన్న ఆలయ విస్తరణ పనులు వేగంగా...

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. తిప్పాపూర్ బస్‌స్టేషన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. లక్షలాది మంది భక్తులు, ప్రయాణికులకు ఆధునీకరించిన బస్‌స్టేషన్ ఎంతో ఉపయోగ పడుతుందని చెప్పారు.రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి 2023--24లో రూ.50 కోట్లు, 2024--25లో రూ.100 కోట్లు, అనంతరం మరో రూ.99.40 కోట్లు మంజూరు కావడంతో మొత్తం రూ.249.40 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం దాదాపు 45 శాతం పనులు పూర్తయ్యాయని, మరో 10 నుంచి 12 నెలల్లో పూర్తిచేసి రాబోయే వెయ్యేళ్ల అవసరాలకు అనుగుణంగా ఆలయాన్ని తీర్చిదిద్దతామని వెల్లడించారు. రూ.35 కోట్లతో అన్నదాన సత్రం, రూ.47 కోట్లతో రహదారి విస్తరణ, రూ.10 కోట్లతో బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి, రూ.12 కోట్లతో గుడి చెరువు బండ్ పార్క్ నిర్మాణం చేపట్టినట్లు వివరిం చారు.

వరుణయాగానికి శ్రీకారం...

జిల్లా పర్యటనలో భాగంగా వేములవాడకు చేరుకున్న మంత్రులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే స్వాగతం పలికారు. అనంతరం శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పూర్ణకుంభంతో మంత్రులను ఆహ్వానించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు నిర్వహించే సత్వర సద్యఃసువృష్టి వరుణయాగాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఋుశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, హవనాలు, సంతత ధారాభిషేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. భీమేశ్వర సదన్‌లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతను ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ వరుణయాగం లోకకల్యాణం కోసం నిర్వహించే మహోన్నత వైదిక సంప్రదాయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని, తెలంగాణ సస్యశ్యామలంగా వెలుగొందాలని ఆకాంక్షించారు.

గుడి చెరువు బండ్ పార్క్ ప్రారంభం...

అనంతరం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రూ.12 కోట్లతో అభివృద్ధి చేసిన శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువు బండ్ పార్క్‌ను మంత్రులు ప్రారంభించారు. పార్కులో ఏర్పాటు చేసిన భారీ శివుడి విగ్రహం, నటరాజ స్వామి విగ్రహం, సప్తమాతృకల విగ్రహాలు, ఉద్యానవనాన్ని పరిశీలించారు. ఈ పార్క్ వేములవాడకు వచ్చే భక్తులతో పాటు పర్యాటకులకు మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని మంత్రులు అభిప్రాయపడ్డారు.









## ధర్మోరా, పాలెం గ్రామాల మధ్య నిలిచిన వాహన రాకపోకలు

### ముందస్తు జాగ్రత్తలు తీసుకున్న సర్పంచ్, ఆపదమిత్ర

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 30:

మోర్తాడ్ మండలంలోని ధర్మోరా, పాలెం గ్రామాల మధ్య పెద్దవాగుపై నిర్మించిన చెక్ డ్యాం వద్ద వరద ప్రవాహం ఉధృతంగా మారింది. ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న భారీ వరద కారణంగా చెక్ డ్యాం పూర్తిగా నిండి, రోడ్డుపై నుండి నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ధర్మోరా గ్రామ సర్పంచ్ స్వర్ణాల మానస లక్ష్మణ్, పంచాయతీ సిబ్బంది కారోబార్ సాయన్నలతో ఆపదమిత్ర మహేష్ కుమార్ చర్చించారు. ప్రజల భద్రతను దృష్ట్యా రెండు గ్రామాల మధ్య వాహన రాకపోకలు జరగకుండా రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్‌ను ఉంచి తాత్కాలికంగా మార్గాన్ని బంద్ చేశారు. ఈ సందర్భంగా ఆపదమిత్ర మహేష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందే అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవడం మిన్న అని పేర్కొన్నారు. వరద ఉధృతి తగ్గేవరకు ప్రజలు, వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించవద్దని, సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వర్ణాల మానస లక్ష్మణ్, కారోబార్ సాయన్న తదితరులు పాల్గొన్నారు.









## నిజామాబాద్‌లో 11 మంది ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి

### అభినందించిన పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 30:

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 11 మంది అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లకు (ఏఎస్ఐ) సబ్ ఇన్స్పెక్టర్లుగా (ఎస్ఐ) పదోన్నతి లభించింది. తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు ప్రమోషన్ పొందిన ఈ 11 మంది అధికారులు గురువారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐ.పీ.ఎస్. గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ప్రత్యేక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. గత కొంతకాలంగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న సిబ్బందికి ఈ పదోన్నతులు రావడం పట్ల కమిషనరేట్ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. కొత్త బాధ్యతలను అంతే నిబద్ధతతో, సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా అధికారులకు సీపీ పిలుపునిచ్చారు. పదోన్నతి పొందిన అధికారుల వివరాలు:

బి. జాన్సన్ (మహిళా పోలీస్ స్టేషన్, నిజామాబాద్)
జి. రాజేశ్వరరెడ్డి (వేల్పూరు పోలీస్ స్టేషన్)
వి. అనిల్ కుమార్ (ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, నిజామాబాద్)
శ్రీనివాస్ రెడ్డి (ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, నిజామాబాద్)
బి. సాయిలు (టౌన్-2 పోలీస్ స్టేషన్, నిజామాబాద్)
ఎం.డి. లాయక్ అలీ (టౌన్-4 పోలీస్ స్టేషన్, నిజామాబాద్)




డి. చిన్న గంగారం (టౌన్-1 పోలీస్ స్టేషన్, నిజామాబాద్)
ఎస్.కె. గఫర్ (నవీపేట్ పోలీస్ స్టేషన్)
కె. బాబురావు (బోధన్ టౌన్ పోలీస్ స్టేషన్)
పి. శంకర్ (జక్రన్ పల్లి పోలీస్ స్టేషన్)
రేణుకా దేవి (రుద్రూర్ పోలీస్ స్టేషన్)ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, పీఆర్వో మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ జిల్లా 4వ మహాసభను విజయవంతం చేయండి

### - జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు




మహేశ్వరం, జూలై 30,( ప్రజా కలం )

ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్( ఏఐటియుసి ) రంగారెడ్డి జిల్లా నాలుగోవ మహాసభ ఆగస్టు 2న తుక్కుగూడలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఈ మహాసభకు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్ సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి చంద్రయ్య లు హాజరవుతున్నారని పర్వతాలు తెలిపారు. జిల్లాలో ఏఐటీయూసీ విస్తరణకు భవిష్యత్తు ఉద్యమాలకు కార్మికుల సమస్యలు, కార్మికులకు వైద్య సదుపాయాల కోసం జిల్లా కేంద్రంగా ఈఎస్ఐ హాస్పిటల్ నియమించాలి, వలస కార్మికుల సమస్యల పై మహాసభలో చర్చించి నిర్ణయాలు చేస్తామని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుపై ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.దత్తు నాయక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి జిల్లా కార్యదర్శి కే చందుయాదవ్ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్ పి.దేవేందర్ గౌడ్, కొమ్మ గళ్ళ రాజు యాదగిరి, శివ అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ సూత్రాల్ని పాటించిన పాస్టర్ అనంతరావు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 30:

ఇటీవల ముంబైలోని ప్రఖ్యాత తెలుగు పాస్టర్ మూగ అనంతరావు అనారోగ్యం వల్ల మృతి చెందిన విషయం విధితమే. ఆయన స్వగ్రామం వర్షకొండ, జిల్లా జగిత్యాల. మహానగరంలో ఉన్నత చదువులు చదివి, ఇంజనీర్ గా తన విధిని నిర్వహించారు. ముంబైలో తమ తెలంగాణ వలసజీవుల తొలి ఏకైక ఆంధ్ర




హరిజన సేవ సంఘం "యూత్ (మాదిగ మాల) వింగ్" కోసం 1981 నుంచి 1985 వరకు కార్యదర్శిగా తన బాధ్యతలు పటిష్టంగా నిర్వహించారు. అంబేడ్కర్ భావజాలం పట్ల మంచి అవగాహన కల్గిన వ్యక్తిగా తమ పాత సభ్యులు చెబుతుంటారని, ఐతే తాను బాబాసాహెబ్ యొక్క మూడు సుక్తుల ప్రకారం క్రైస్తవ సమత ధర్మాన్ని బస్తి బస్తిలో, మరోవైపు మారుమూల గ్రామాల్లోకి "బోధించిన" క్రియాశీల యోధుడు. బోధించిన అనంతరం ప్రజల్ని సంఘంలో "సమీకరించా"రు. అనేక సంఘాల్ని స్థాపించారు. తాను సొంత డబ్బులు ఖర్చు పెట్టుకునే త్యాగధనులు. దుష్ట శక్తులు, మూఢనమ్మకాలతో శాంతియుతంగా "పోరాడాడు". ఇలాంటి నిస్వార్థ దైవసేవలను, మానవీయ సేవల్ని "దళిత క్రైస్తవ చరిత్ర" లో లిఖించాల్సిన అవసరముందని సీనియర్ జర్నలిస్ట్ మూలనివాసి మాలజీ ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. మంగళవారం సాయంత్రం పరేల్ మెథడిస్ట్ చర్చిలో ఏర్పాటు చేసిన దివంగత అనంతరావు పాస్టర్ ఓదార్పు కూడికలో ఆయనను జ్ఞాపకం చేసుకోవడం జరిగింది. ఈ కూడికకు మహానగరమే కాకుండా తెలుగు రాష్ట్రాల నుంచి 60మంది దైవజనులు హాజరవ్వడం విశేషం.

## డాక్టర్ విశారదన్ మహరాజ్ అక్రమ అరెస్టు అప్రజాస్వామికం

### మోర్తాడ్ మండల బీసీ,ఎస్సీ, ఎస్టీ జేఏసీ అధ్యక్షులు ఉమేష్ మహారాజ్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 30:

జగిత్యాల జిల్లా నూకపల్లి గ్రామంలోని ఇందిరమ్మ కాలనీ వాసుల సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ మరియు ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ విశారదన్ మహారాజ్ అక్రమ అరెస్టును నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ



(ధర్మ సమాజ్ పార్టీ) అధ్యక్షులు ఉమేష్ మహారాజ్ తీవ్రంగా ఖండించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీ ప్రజల బాధలను, సమస్యలను పట్టించుకోవాల్సిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, అందుకు భిన్నంగా తన అధికార ప్రోత్బలంతో మల్యాల, జగిత్యాల పోలీసులను ఉపయోగించి ఈ అక్రమ అరెస్టు చేయించడం సిగ్గుచేటని మండిపడ్డారు.

శాంతియుతంగా సాగుతున్న ప్రజాస్వామ్య నిరసనను భగ్నం చేయడం అప్రజాస్వామికమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుల పక్షాన నిలబడిన నాయకుడిని నిర్బంధించడాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలని ఉమేష్ మహారాజ్ పిలుపునిచ్చారు.

## భారీ వర్షాల పట్ల మహేశ్వరం ప్రజల అప్రమత్తంగా ఉండాలి

### మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, జూలై 30, (ప్రజా కలం )

తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మహేశ్వరం నియోజకవర్గ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితులు మినహా బయటకు వెళ్లకుండా ఉండండి. లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలి. వాగులు, వంకలు, చెరువులు, వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలను దాటేందుకు ప్రయత్నించవద్దు. విద్యుత్ తీగలు తెగి పడిన ప్రాంతాలకు దూరంగా ఉండండి. పిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్దు. వాతావరణ శాఖ హెచ్చరికలను, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించండి. అవసరమైతే వెంటనే స్థానిక అధికారులకు సమాచారం అందించండి.



రాష్ట్రంలో భారీ వర్షాలపై హెచ్చరికలు కొనసాగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు."ప్రజల భద్రతే మనందరి తొలి ప్రాధాన్యం. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సబితా ఇంద్రారెడ్డి కోరారు.

## తిమ్మపూర్ గ్రామసభ విజయవంతం

### : భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు రక్షణ చర్యలు
### కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్ల నుండి సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపు
### ప్రాణ, ఆస్తి నష్టాల నివారణే లక్ష్యం: సర్పంచ్ పుప్పాల నరేష్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 30:

తిమ్మపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం నాడు గ్రామసభ విజయవంతంగా నిర్వహించబడింది. ప్రస్తుత వర్షాకాలంలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా, గ్రామంలో ఎలాంటి ముప్పు వాటిల్లకుండా పంచాయతీ యంత్రాంగం ముందస్తు రక్షణ చర్యలు చేపట్టింది. వర్షాల వల్ల సంభవించే ప్రమాదాలను నివారించి, గ్రామ ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ అవగాహన కార్యక్రమాలు, రక్షణ చర్యలు చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ పుప్పాల నరేష్ తెలిపారు. క్షేత్రస్థాయిలో సర్పంచ్ పర్యటన -- వృద్ధురాలి రక్షణ:వర్షాల ధాటికి గ్రామంలోని పాతబడిన, శిథిలావస్థకు చేరిన ఇళ్ల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్న సమాచారంతో సర్పంచ్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ క్రమంలో, ఏ క్షణమైనా కూలిపోయే ప్రమాదకర స్థితిలో ఉన్న ఒక ఇల్లాన్ని ఆయన గుర్తించారు. అక్కడి పరిస్థితి యొక్క తీవ్రతను గమనించి, ఆ ఇంట్లో నివసిస్తున్న ఒక వృద్ధ మహిళను తక్షణమే సురక్షిత ప్రాంతంలోని వేరొక ఆర్‌సీసీ భవనంలోకి విజయవంతంగా తరలించి రక్షణ కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:ఈ సందర్భంగా సర్పంచ్ పుప్పాల నరేష్ మాట్లాడుతూ.. "గ్రామస్థుల భద్రత, సంక్షేమమే మా తొలి ప్రాధాన్యత. వర్షాకాలం ముగిసే వరకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. గ్రామంలో ఎక్కడైనా శిథిలావస్థలో ఉన్న ఇళ్లు లేదా ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే తక్షణమే పంచాయతీ లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సదానంద్, పంచాయతీ కార్యదర్శి నరేందర్, జీపీ సిబ్బంది, రెవెన్యూ అధికారులు మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొని సహాయక చర్యల్లో భాగస్వాములయ్యారు.



# బోనాలు ఏర్పాట్లు సవ్యంగా నిర్వహించాలి

## అధికారులకు పద్మారావు గౌడ్ ఆదేశాలు

సికింద్రాబాద్
జూలై 30 (ప్రజా కలం ప్రతినిధి)

చిలకలగూడా కట్ట మైసమ్మ దేవాలయంలో జరిగే బోనాలు వేడుకల్లో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికార యంత్రాంగం సమన్వయంగా వ్యవహరించి అన్నీ ఏర్పాట్లు జరపాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన చిలకలగూడా కట్ట మైసమ్మ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనాలు ఏర్పాట్లను పరిశీలించారు. వివిధ విభాగాల అధికారులతో ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ - చిలకలగూడ కట్ట మైసమ్మ దేవాలయం లో ఆగష్టు 9 తేధీన బోనాలు, 10న రంగం వేడుకలు జరుగుతాయని, పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. బోనం తో వచ్చే భక్తులకు ప్రత్యేకంగా క్యూ లైన్ లు ఏర్పాటు చేయాలని, బారికేడ్ లు ఏర్పాటు చేయాలని కోరారు. పోలీస్ లు సరైన సమన్వయం ఏర్పాటు



చేసుకోవాలని, సీ సీ. కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపులను పద్ధతిగా చేపట్టాలని పద్మారావు గౌడ్ కోరారు. మున్సిపల్ అధికారులు రోడ్ల ప్యాచ్ వర్క్ లు పూర్తి చేయాలి, పారిశుద్ధ్య పనులు నిరంతం సాగించాలని, వీధి దీపాలు సవ్యంగా పనిచేయాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కరెంట్ పోకుండా జాగ్రత్త పడాలని జనరేటర్ లు సిద్దంగా ఉంచుకోవాలని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా సూచించారు. జల మండలి ద్వారా మంచినీటి సరఫరా రెండు రోజులు చేపట్టాలని, మెడికల్ డిపార్టుమెంటు ద్వారా వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరారు. తమ క్యాంపు కార్యాలయం ద్వారా అన్నీ విభాగాల అధికారులు సమన్వయం ఏర్పాటు చేసుకోవాలని పద్మారావు గౌడ్ సూచించారు. బోనాలు సందర్భంగా కట్ట మైసమ్మ దేవాలయానికి అదనంగా నిధులను మంజూరు చేయిస్తామని, ప్రభుత్వం ద్వారా లభించని పక్షంలో సొంత విరాళాన్ని అందించేందుకు సిద్దమని పద్మారావు ప్రకటించారు. చిలకలగూడా మెయిన్ రోడ్డు పునర్నిర్మాణం ప్రతిపాదనలు రూపొందించాలని, ఆలయం హక్కుదారులకు ఆర్ధిక సాయాన్ని పెంచాలని ఆదేశించారు. ఆలయం ఛైర్మన్ గుంటి కృష్ణ, కార్యనిర్వహణాధికారి మహేందర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు సామల హేమ, రాసురి సునీత, యువ నేత తీగుళ్ళ కిశోర్ కుమార్, వివిధ విభాగాల అధికారులు, నాయకులు పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్లు సామల హేమ, రాసురి సునీతలు మాట్లాడుతూ అధికారులు ప్రోటోకాల్ నిబంధనలు ఉల్లంఘిస్తు చట్టాలకు విరుద్దంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ప్రజల ద్వారా ఎన్నికైన స్థానిక శాసనసభ్యుడికి సమాచారం అందించడం లేదని, ఆహ్వాన పత్రికల ముద్రించడంలో కూడా వివక్ష చూపుతున్నారని సామాల హేమ తదితరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో తప్పులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు పాటించాలని పద్మారావు గౌడ్ అధికారులను ఆదేశించారు.

# పోచంపల్లి నూతన ఎస్సై జె.జగన్ పదవి బాధ్యతల స్వీకరణ

## డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలను అణచివేస్తాం

భుదాన్ పోచంపల్లి జులై 30 (ప్రజా కలం )

భుదాన్ పోచంపల్లి నూతన సబ్ ఇన్స్పెక్టర్ జె. జగన్ గురువారం రోజు బాధ్యతలు స్వీకరించారు. ఈయన యాదాద్రి భువనగిరి జిల్లా సైబర్ క్రైమ్ విభాగంలో పనిచేశారు. అక్కడ నుండి పోచంపల్లికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన సబ్ ఇన్స్పెక్టర్ కంచర్ల భాస్కర్ రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా హెడ్ క్వార్టర్స్ కి బదిలీ అయ్యారు. ప్రస్తుత సబ్ ఇన్స్పెక్టర్ జగన్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు ఆటంకం కలగకుండా ప్రజలు పోలీస్ సిబ్బందికి ఎల్లవేళలా సహకరించాలని. ముఖ్యంగా యువత మద్యం, గంజాయికి దూరంగా ఉండాలని సూచించారు.విద్య అభ్యసించాల్సిన వయసులో యువత




పక్కదారికి వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనించాల్సింది అవసరం ఎంతైనా ఉన్నదని అన్నారు. పోచంపల్లి మండల కేంద్రంలోని డ్రగ్స్ రవాణా, వినియోగం మీద ఉక్కు పాదం మోపుతామని ఆయన అన్నారు. మత్తు పదార్థాల వాడకం అనేది సమాజానికి పట్టిన చీడపు రుగు వంటిది అని,డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. తెలిసీ తెలియక మత్తు పదార్థాల బారిన పడడం వల్ల యువత యొక్క బంగారు భవిష్యత్తు నాశనం అవుతోందని, యువత యొక్క శారీరక మానసిక ఆరోగ్యాన్ని మత్తు పదార్థాలు విచ్చిన్నం చేస్తున్నాయని తెలిపారు.నిషేధిత డ్రగ్స్ వాడడం వల్ల ఎన్నో రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని, కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయన్నారు. నిషేధిత డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వాడకం పట్ల విద్యార్థులు ఆకర్షితులు కావద్దనిచెప్పారు. పలు రకాల సామాజిక మాధ్యమాలు, సినిమాల వంటి వాటిలో చూసి డ్రగ్స్ వాడడం పట్ల ఆకర్షణకు లోనయి పిల్లలు తమ జీవితం నాశనం చేసుకోకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.డ్రగ్స్ సరఫరా చేసే ముఠాల మీద కేసులు నమోదు చేస్తామని ఆయన అన్నారు.

# కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా పోచంపల్లి బ్యాంకు సేవలు

**- పోచంపలి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 53వ సర్వసభ్య సమావేశం**

**- పోచంపలి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేష్ - బ్యాంకు సి.ఇ.ఓ సీత శ్రీనివాస్**




భూదాన్ పోచంపల్లి,
జూలై 30 (ప్రజా కాలం )

కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా పోచంపల్లి బ్యాంకు సేవలు అందిస్తుందని పోచంపలి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేష్ అన్నారు. పోచంపలి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 53వ సర్వసభ్య సమావేశం గురువారం నాడు మద్యాహ్నం 3గం లకు బ్యాంకు చైర్మన్ తడక రమేష్ అధ్యక్షతన బ్యాకు కేంద్ర కార్యాలయంలోని కొంగరి భాస్కర్ ఆడిటోరియం నందు నిర్వహించారు. ఈ సమావేశంలో చెర్మన్ తడక రమేష్ మాట్లాడుతూ సమీకరించిన వాటాధనం 16.89 కోట్లు, డిపాజిట్లు 327.26 కోట్లు, మహోరీ చేసిన రుణాలు 247.40 కోట్లు కలవని తేది 30-06-2026 నాటికి సమీకరించిన వాటాధనం 19.33 కోట్లు, డిపాజిట్ల 358.17 కోట్లు, మంజూరు చేసిన ఋణాలు 272-79 1 కోట్లకు చేరుకుందని తెలిపారు.

బ్యాంకు సి.ఇ.ఓ సీత శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకు దినదినాభివృద్ది చెందుతూ జాతీయ, కార్పొరేట్, ప్రైవేట్ రంగ బ్యాంకులకు ధీటుగా ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నా మని, కో- ఆపరేటివ్ బ్యాంకింగ్ రంగంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి 42%. పైన వ్యాపారవృద్ధి సాధించి, వ్యాపారవృద్దిలో ప్రథమస్థానంలో నిలిచిందని, భవిష్యత్తులో మరెన్నో మైలురాళ్ళను అధిగమించుటకు శ్రామశక్తులా కృషిచేస్తున్నామని తెలియజేసారు.

అదేవిదంగా గత ఆర్థిక సంవత్సరానికి సంబందించిన డివిడెండ్ 16% వాటా దారులకు చెల్లిస్తున్నామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రహ్మణ్యం, ఏలె హరిశంకర్, సూరెపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, బిట్టు భాస్కర్, మక్తాల నర్సింహ, నూతలపాటి క్రిష్ణకిషోర్, సోమె అనంతరాములు, కొల్ల రామగోపాల రావు, సీత సత్యనారాయణ, బోగ సిద్దిరాములు, కొండ శంకరయ్య, కొండమడుగు ఎల్లస్వామి, గీత పాలకవర్గ సభ్యులు, వాటాదారులు, ఖాతాదారులు, తేయోబిలాషులు, వివిద శాఖల సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కె. సురేష్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫీస్ భువనగిరి పాల్గొన్నారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా "మిషన్-80" ప్రపంచ రికార్డు పోస్టర్ ఆవిష్కరణ

హైద్రాబాద్ జూలై 30(ప్రజాకలం న్యూస్)

భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "మిషన్-80" ప్రపంచ రికార్డు ప్రయత్నం పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతులమీదుగా వారి కార్యాలయంలో గురువారం




ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ కరాటే రంగంలో విశేష సేవలందిస్తున్న వి. సుధాకర్ చేపట్టనున్న ఈ వినూత్న ప్రపంచ రికార్డు ప్రయత్నం తెలంగాణ రాష్ట్రానికే కాకుండా దేశానికి కూడా గర్వకారణమని పేర్కొంటూ, ఆయన విజయవంతంగా ప్రపంచ రికార్డు సాధించాలని ఆకాంక్షించారు. ఆగస్టు 9, 2026న ఉదయం 9 గంటలకు హైద్రాబాద్ లోని డా.జి.ఎస్. మెల్కోటే పార్క్, నారాయణగూడలో జరగనున్న ఈ కార్యక్రమంలో వి. సుధాకర్ కేవలం 8 నిమిషాల్లో 9 రకాల కరాటే బాడీ టెక్నిక్స్ ఉపయోగించి 80 షాబాద్ టైల్స్‌ను బద్దలు కొట్టి ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు సిద్ధమవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ ప్రపంచ రికార్డు ప్రయత్నం భారత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు నివాళిగా, యువతలో దేశభక్తి,క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో హిమాయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రమన్ గౌడ్,జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు డైరెక్టర్ డా.జి.ఎస్. గోపాల్ రెడ్డి, ప్రపంచ రికార్డు ప్రయత్నకర్త వి. సుధాకర్,అమృత రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, క్రీడాభిమానులు, యువత,ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ చారిత్రాత్మక ప్రపంచ రికార్డు ప్రయత్నాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# ఓటర్ సవరణ బిజీ..

# అక్రమ నిర్మాణాలు జోరు..!

**-ఇంద్రేశం మున్సిపాలిటీలో యథేచ్ఛగా నిర్మాణాలు..**

**-అనుమతులకు మించి భారీ అక్రమ కట్టడాలు..**

**-ఎస్ఐఆర్ బిజీలో.. తప్పించుకుంటున్న అధికారులు..**

**-ఆగస్టు 3 తర్వాత అక్రమ నిర్మాణాలపై చర్యలు ఉంటాయా..? అనే ప్రశ్నలు..**

పటాన్‌చెరు, జులై 30 (ప్రజా కలం) ప్రతినిధి

ఎస్ఐఆర్ ( ప్రత్యేక ఓటర్ల సవరణ ) ప్రక్రియ మున్సిపల్ అధికారులకు కొత్త బాధ్యతలు తీసుకొచ్చిన నేపథ్యంలో మరోవైపు అక్రమ నిర్మాణదారులకు మాత్రం ఇది అనుకూల సమయంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.గత రెండు నెలలుగా మున్సిపల్ అధికారులు ఎస్ఐఆర్ విధుల్లో నిమగ్నం కావడంతో అక్రమ నిర్మాణాలపై పర్యవేక్షణ తగ్గిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమదారులు అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని, మరికొందరు ఎలాంటి అనుమతులు లేకుండానే భారీ కట్టడాలు నిర్మిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణాలు సాగుతున్నా వాటిని అడ్డుకునే యంత్రాంగం



కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులను వివరణ కోరగా,ఎస్ఐఆర్ పనుల్లో బిజీగా ఉన్నాం అంటూ సమాధానం ఇస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అయితే ప్రజా సమస్యల పరిష్కారం, అక్రమ నిర్మాణాల నియంత్రణ కూడా అధికారుల బాధ్యతేనని వారు గుర్తుచేస్తున్నారు.

**ఆగస్టు 3 తర్వాత ఏం జరుగుతుంది.?..**

ఎస్ఐఆర్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఇంద్రేశం మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపిస్తారా.? నిర్మాణాలను గుర్తించి సీజ్ చేస్తారా.? లేక ఇప్పటివరకు జరిగిన ఉల్లంఘనలను పట్టించుకోకుండా వదిలేస్తారా.? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అధికారుల నిర్లక్ష్యంతోనే అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నాయా.? లేక ఎస్ఐఆర్ పేరుతో పర్యవేక్షణ తగ్గడం వెనుక మరేదైనా కారణముందా.? అనే అనుమానాలను



స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఇంద్రేశం మున్సిపాలిటీలో పర్యవేక్షణ సిబ్బంది ఎక్కడ ఉన్నారు.? ఇప్పటివరకు ఎన్ని అక్రమ నిర్మాణాలను గుర్తించారు.? ఎన్ని చర్యలు తీసుకున్నారు.? అనే విషయాలపై ఉన్నతాధికారులు సమాధానం చెప్పాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటారా.? లేక ఎస్ఐఆర్ ముసుగులో ఉల్లంఘనలకు అవకాశం ఇస్తారా.? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది..

# గౌతమ్ నగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

మల్కాజిగిరి,జూలై 30(ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని జయగిరి న్యూ వెంకటేశ్వర నగర్,జయగిరి లక్ష్మీనరసింహస్వామి నగర్ తదితర ప్రాంతాలలో మౌలికోవసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ బిఆర్ ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్ ఆధ్వర్యంలో గురువారం జోనల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జయగిరి లక్ష్మీనరసింహస్వామి నగర్ మరియు వెంకటేశ్వర నగర్ తదితర ప్రాంతాలలో అంతర్గత రోడ్లు బాక్స్ డ్రైవ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.సందర్భంగా సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు అని రాము యాదవ్ చెప్పారు.ఈ కార్యక్రమంలో న్యూ వెంకటేశ్వర నగర్ కాలనీవాసులు బాలయ్య,రమేష్ కుమార్ పాల్,లడ్డు జయగిరి లక్ష్మీనరసింహస్వామి నగర్ కాలనీవాసులు, బిఆర్ ఎస్ నాయకులు మల్లేష్ రాజా భాను , తదితరులు ఉన్నారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com